# ప్రజా తపన

prajathapana.com

*News that matters*




ఐదు అత్యుత్తమ భావాలను సరిగా అర్థం చేసుకుని, ఆచరిస్తూ వాడితో నిత్య జీవితాన్ని మలచుకుంటే, మొత్తం గ్రంథాలయాన్నే కంఠస్థం చేసిన వారి కన్నా మీరు ఎక్కువ విద్యావంతులు.

\- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 10 గురువారం 16 ఫిబ్రవరి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో నెంబర్ వన్

**కడప :**

దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని సీఎం జగన్మోహన్ రెడ్డి అన్నారు. కడప జిల్లాలో దేవుడి దయతో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కాబోతోందని చెప్పారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఎక్కువ మందిని పిలవలేకపోయామని చెప్పారు. కడప స్టీల్ ప్లాంట్ అనేది ఎప్పటి నుంచో కలలుగన్న కల అని అన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని వైఎస్సార్ కలలుగన్నారని గుర్తు చేశారు. వైఎస్ఆర్ మరణం తర్వాతి నుంచి ఈ ప్రాంతాన్ని ఎవరూ పట్టించుకోలేదని విమర్శించారు. జమ్మలమడుగు మండలం సున్నపురాళ్ళ పల్లెలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి జేఎస్‌డబ్ల్యూ ఛైర్మన్ సజ్జన్ జిందాల్ తో పాటుగా సీఎం జగన్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం జగన్ మాట్లాడారు. రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉందని అన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో గత మూడేళ్లుగా ఏపీ మొదటి స్థానంలో ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ఈ ప్లాంటుకి సకల సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం తరపున దాదాపు రూ.700 కోట్ల ఖర్చుతో మౌలిక వసతుల సౌకర్యాలు అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. 30 నెలల్లోపు స్టీల్‌ప్లాంట్ మొదటి దశ పూర్తవుతుందని అన్నారు. మొత్తం 30 లక్షల టన్నుల సామర్థ్యంతో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుతో చుట్టుపక్క అనుబంధాల రంగాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. చదువుకున్న మన కుటుంబాల పిల్లలకు మన ప్రాంతంలో ఉపాధి లభిస్తుందని చెప్పారు. 75 శాతం ఉద్యోగాలు ఇవ్వాలని చట్టం కూడా తెచ్చామని అని సీఎం జగన్ అన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "రూ.8,800 కోట్లతో 3 మిలియన్ టన్నుల స్టీల్ ఉత్పత్తి అవుతుంది. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో జిల్లా మరింత అభివృద్ధి చెందుతుంది. ఈ ప్లాంట్ రావడం కోసం చాలా కష్టాపడాల్సి వచ్చింది. అయినా దేవుడి దయతో మనకు మంచి రోజులు వచ్చాయి. స్టీల్ ప్లాంట్‌వస్తే ఈ ప్రాంతం స్టీల్ సిటీ తరహాలో అభివృద్ధి చెందుతుంది. గండికోట రిజర్వాయర్ నుంచి ప్రత్యేక పైపులైన్ ద్వారా నీటి సరఫరా అవుతుంది. తొలి విడతలో రూ.3,300 కోట్లతో ఏటా 10 లక్షల టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుంది" అని సీఎం జగన్ మాట్లాడారు. తాను వైఎస్ రాజశేఖర్ రెడ్డిని కలిసినప్పుడు వైఎస్ జగన్ యువకుడని గుర్తు చేసుకున్నారు. ఆయన్ను ముంబయికి తీసుకెళ్లి వ్యాపార సూత్రాలు నేర్పించాలని వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనతో చెప్పారని అన్నారు. 15-17 ఏళ్ల క్రితం జగన్



ముంబయిలోని తన ఆఫీస్‌కు కూడా వచ్చారని చెప్పారు. "ఇప్పుడు ఏపీని సీఎం జగన్ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. ప్రజా సంక్షేమమే తన జీవిత లక్ష్యంగా జగన్ భావిస్తున్నారు. విజయవాడలో సీఎంతో కలిసి లంచ్ చేసినప్పుడు రాష్ట్రం గురించి చాలా మాట్లాడుకున్నాం. వైద్య ఆరోగ్య రంగం నుంచి డిజిటలైజేషన్ వరకూ ఆయన మాటలు నాకు చాలా బాగా అనిపించాయి. నాకు తెలుగు మాట్లాడటం రాదు లేదంటే నేను చెప్పే విషయాలు మీకు పూర్తిగా మీకు అర్థమయ్యేవి. సీఎం జగన్ లాంటి యంగ్ అండ్ డైనమిక్ లీడర్ ఉండటం వల్ల కలిగే ప్రయోజనం ఏంటో ఏపీలో స్పష్టంగా కనిపిస్తోంది" అని సజ్జన్ జిందాల్ సీఎంను ఉద్దేశించి కొనియాడారు.

## మాజీ మంత్రి కుతూహలమ్మ కన్నుమూత

**తిరుపతి**

ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి, డిప్యూటీ స్పీకర్ గుమ్మడి కూతుహలమ్మ బుధవారం ఉదయం మరణించారు. ఆమె వృత్తిరిత్యా డాక్టర్. 1978 లో కాంగ్రెస్ పార్టీ రెబెల్ అభ్యర్థి గా చిత్తూరు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా పనిచేయడం ద్వారా రాజకీయాల్లో ప్రవేశించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గా 1985, 1989, 1999, 2004 ఎన్నికలలో వేపంజేరి నియోజకవర్గం నుంచి, 2009లో గంగాధర నెల్లూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి


(మిగతా 2లో)




## కొండగట్టు అంజన్నకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక పూజలు

**జగిత్యాల**

జిల్లాలోని కొండగట్టుకు ముఖ్యమంత్రి కేసీఆర్ చేరుకున్నారు. ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్.. కొండగట్టు సమీపంలోని నాచుపల్లి జేఎన్టీయూకు చేరుకున్నారు. మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్ సీఎం కేసీఆర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అటునుంచి రోడ్డుమార్గంలో అంజన్న క్షేత్రానికి చేరుకున్నారు. ఆలయం వద్ద సీఎం కేసీఆర్‌కు పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.



స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం అందించారు. అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కొండగట్టుపై ఉన్న కోనేరు, కొత్త పుష్కరిణి, బేతాళస్వామి ఆలయం, సీతమ్మ కన్నీటిధార,


(మిగతా 2లో)


## హైదరాబాద్ ఒక చారిత్రక ఆధునిక నగరం

**హైదరాబాద్**

హైదరాబాద్ నగరం ఆధునిక వసతులతో చాలా బాగుందని ఆసియన్ దేశాల మీడియా ప్రతినిధులు ప్రశంసించారు. ఇక్కడి వసతులు, ఆతిధ్యం తమకు నచ్చినట్లు సంతోషం వ్యక్తం చేశారు. హైదరాబాద్ ను తమ ఇండియా పర్యటన షెడ్యూల్ లో భాగం చేసుకోవాలని యువతకు సూచించనున్నట్లు పేర్కొన్నారు.

ఆసియాన్ -ఇండియా మీడియా ఎక్చేంజ్ లో భాగంగా మియన్మార్, కాంభోడియ, వియత్నాం, థాయిలాండ్, ఇండోనేషియా, బ్రూనై , పిలిప్పీన్స్ , మలేసియా దేశాలకు చెందిన 17 మంది జర్నలిస్టుల బృందం తెలంగాణలో ఈ నెల 12 నుంచి హైదరాబాద్ లోని పలు పారిశ్రామిక , చారిత్రక, వాణిజ్య ఆర్థిక సంస్థలను సందర్శించింది. ఆసియాన్ మీడియా పర్యటనను రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సమన్వయం చేసింది. తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ కు చెందిన పర్యాటక బస్ ద్వారా వాహన సదుపాయం కల్పించారు.

ఆసియన్ సెక్రటేరియట్ కు చెందిన సీనియర్ ఆఫీసర్ పట్గీయా టెంగ్ ఫియంగ్ ఆధ్వర్యంలో ఈ బృందం పర్యటించింది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పచ్చదనంతో ఆహ్లాదకరంగా వున్నదని పేర్కొన్నారు.



బుధవారం 15 న శంషాబాద్ విమానాశ్రయం నుంచి సింగపూర్ ద్వారా ఆసియన్ మీడియా ప్రతినిధులు ఆయా దేశాలకు తిరిగి వెళ్లారు.

హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ఆసియన్ మీడియా ప్రతినిధులను రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు బి. రాజమౌళి సత్కరించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి ఆయన వారికి వివరించారు. హైదరాబాద్ ను విశ్వ నగరంగా తీర్చిదిద్దుటకు ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు బి. రాజమౌళి వివరించారు.

తమ పర్యటనలో భాగంగా శామీర్ పేట్ లో జరిగిన 4 వ ఏషియల్ ఇండియా యూత్ సమ్మిట్ లో ఈ బృందం పాల్గొన్నది. సాలార్ జంగ్ మ్యూజియం ను సందర్శించినది. భారత దేశంలోని రాజులు వినియోగించిన ఆయుధాలను, అలంకరణ , మెడిసిన్, గృహ వినియోగ నగిషీ వస్తువులను , పెయింటింగ్స్, శిల్పాలను వారు పరిశీలించినారు. ఆనాటి చారిత్రక జ్ఞాపకాలను పదిలపర్చుటకు సాలార్ జంగ్ చూపిన చొరవను వారు ప్రశంసించారు. కొంతమంది చార్మినార్ ను సందర్శించారు.

భారత్ బయోటెక్ ను ఆసియన్ మీడియా సందర్శించినది .ఫార్మా రంగంలో హైదరాబాద్ సాధించిన ప్రగతిని, వ్యాధుల నియంత్రణకు తయారు చేస్తున్న వాక్సిన్ల గురించి తెలుసుకున్నారు. ప్రపంచ ఫార్మా కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందినట్లు అధికారులు వారికి వివరించారు. నేషనల్ పేమెంట్స్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా, శిల్పారామం ను ఆసియన్ మీడియా సందర్శించి , పర్యటన గుర్తుగా కొన్ని వస్త్రాలను, అలంకరణ వస్తువులను మీడియా ప్రతినిధులు కొనుగోలు చేశారు.

# మంత్రి రోజాకు తవ్వా రచనలు అందజేత...!

ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి శ్రీమతి రోజాకు డాక్టర్ తవ్వా వెంకటయ్య తను రచించిన రాయలసీమ తొలి తరం కథలు, ఇతర పుస్తకాలను విజయవాడలోని రోజా స్వగృహంలో బుధవారం అందజేశారు..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార భాషా సంఘం సభ్యుడిగా బుధవారం డాక్టర్ తవ్వా వెంకటయ్య మంత్రి రోజాను కలిశారు..

ఈ సందర్భంగా అధికార భాష అమలుకు బాగా కృషి చేయాలని, ఈ ఏడాది తెలుగు కొత్త సంవత్సరం ఉగాదిని మీ భుజస్కందాల మీద జరపాలని చెప్పారని వెంకటయ్య తెలిపారు..



ఈ కార్యక్రమంలో అధికార భాషా రాష్ట్ర అధికార భాషా సంఘం ప్రధాన కార్యదర్శి, అధికార భాషా సంఘం సభ్యులు డాక్టర్ మస్తానమ్మ, కత్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

# మాజీ మంత్రి కుతూహలమ్మ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

గెలిచారు. 1994 లో కాంగ్రెస్ టికెట్ రాకపోవడం తో వేపంజేరి నుంచి ఇండిపెండెంట్ గా పోటీ చేసి, తరువాత తెలుగుదేశం పార్టీ లో చేరాక 2014లో గంగాధర నెల్లూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసినప్పుడు ఓడిపోయారు. 1992-1993 మధ్య కాలంలో నేదురుమల్లి జనార్ధన రెడ్డి మంత్రి వర్గం లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి గా పనిచేశారు. 2004 లో వై ఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో శాసన సభ డిప్యూటీ స్పీకర్ గా పని చేశారు. తిరుపతి లోని స్వగృహం లో నిద్ర లోనే కన్నుమూసారు.

# కొండగట్టు అంజన్నకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక పూజలు

(మొదటిపేజీ తరువాయి)

కొండలరాయుడి గుట్ట తదితర స్థలాలను పరిశీలించారు. ఆ తర్వాత అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆగమశాస్త్రం ప్రకారం ఆలయంలో చేయాల్సిన మార్పులు-చేర్పులపై సమాలోచనలు జరిపారు.

**కొండగట్టు అంజన్నకు రూ.500 కోట్లు!**

జగిత్యాల జిల్లా మాల్యాల మండలంలోని కొండగట్టు ఆంజనేయ స్వామిని ముఖ్యమంత్రి కేసీఆర్ దర్శించుకున్నారు. ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయం వద్ద సీఎం కేసీఆర్‌కు పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆ తర్వాత అర్చకులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం అందించారు. అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలను కూడా అందించారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి కొండగట్టుపై ఉన్న కోనేరు, కొత్త పుష్కరిణి, కొండలరాయుడి గుట్ట, సీతమ్మ కన్నీటిధార, బేతాళస్వామి ఆలయం తదితర స్థలాలను పరిశీలించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ కొండగట్టు సమీపంలోని నాచుపల్లి జేఎన్టీయూకి తొలుత వెళ్లారు. అక్కడ మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్ సీఎం కేసీఆర్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో అంజన్న క్షేత్రానికి సీఎం కేసీఆర్ చేరుకున్నారు. విహంగ వీక్షణం ద్వారా ఆలయ పరిసరాలను ఆయన పరిశీలించారు. దేవాలయ అభివృద్ధిపై అధికారులతో రెండు గంటలకు పైగా సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వామివారి దర్శనం తర్వాత జేఎన్టీయూ మీటింగ్ హాలులో అధికారులు, ప్రజాప్రతినిధులతో సీఎం కేసీఆర్ సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఆగమశాస్త్రం ప్రకారం ఆలయంలో చేయాల్సిన మార్పులు చేర్పులపై సమాలోచనలు జరిపారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. దేశంలోనే అతి పెద్ద హనుమాన్ క్షేత్రం ఎక్కడ ఉందంటే కొండగట్టు అనే పేరు వినిపించాలని అన్నారు. దేశంలోనే గొప్పగా హనుమాన్ జయంతి కొండగట్టులో జరగాలని.. భక్తుల హనుమాన్ దీక్షాధారణ, విరమణ చేసే సమయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రపంచాన్నే ఆకర్షించేలా అద్భుత ఆధ్యాత్మిక క్షేత్రంగా కొండగట్టును తీర్చిదిద్దాలని సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయం అభివృద్ధి బృహత్తర ప్రాజెక్ట్ అని.. భక్తులకు సకల వసతులు, అన్ని హంగులతో ఆధ్యాత్మిక ఉట్టిపడేలా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని తెలిపారు. ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ఘాట్ రోడ్డులను అభివృద్ధి చేయాలన్నారు. "సుమారు 850 ఎకరాలలో ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు చేయాలి. పెద్ద వాల్, పార్కింగ్, పుష్కరిణీ, అన్నదాన సత్రం, కళ్యాణ కట్ట, కోనేరు, పుష్కరిణీ అభివృద్ధి చేయాలి. 86 ఎకరాలలో సువిశాల పార్కింగ్ ఏర్పాటు చేయాలి. వసతులు గొప్పగా ఉంటే దర్శనానికి వచ్చే భక్తులు పెరుగుతారు" అని సీఎం కేసీఆర్ తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కొండగట్టు పర్యటన సందర్భంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆలయ డెవలప్ మెంట్ కోసం నిర్వహించిన సమీక్ష సమావేశం ముగిశాక ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. కొండగట్టుకు అదనంగా ఇంకో రూ.500 కోట్లు ఇస్తామని ప్రకటించారు. ఇప్పటికే బడ్జెట్‌లో కొండగట్టు కోసం రూ.100 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే. తాజాగా ప్రకటించిన మరో రూ.500 కోట్లు కలిపి మొత్తం రూ.600 కోట్లను కొండగట్టు ఆలయ డెవలప్ మెంట్ కోసం వెచ్చించనున్నారు.

# ఘనంగా శ్రీశైలం బ్రహ్మోత్సవాలు

**కర్నూలు** :

శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం తరుపున ఛైర్మన్ సతీమణి స్వర్ణలత రెడ్డి, జేఈవో వీర బ్రహ్మం దంపతులు, తిరుమల దేవస్థానం వేదపండితులు భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి, అమ్మవారికి ఆనవాయితీగా పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ సతీమణి స్వర్ణలతా రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం దంపతులు, తిరుమల దేవస్థానం వేదపండితులకు... శ్రీశైలం ఆలయ ఈవో ఎస్.లవన్న, ఛైర్మన్, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్ల పట్టు వస్త్రాలకు శ్రీశైల దేవస్థానం ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు ఇచ్చారు. మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రదక్షణలు నిర్వహించి శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవారికి శాస్త్రోక్తంగా పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో శ్రీశైలం దేవస్థానం ఈవో లవన్న, ఛైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ సతీమణి స్వర్ణలతారె డ్డికి, జేఈవో వీరబ్రహ్మం దంపతులకు శ్రీశైలం శ్రీ స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలతో సత్కరించారు. అనంతరం లడ్డు ప్రసాదాలను అందించగా అర్చకులు వేదపండితులు శాస్త్రోక్తంగా వేద ఆశీర్వచనలిచ్చి దీవించారు. మరోవైపు శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సంబరాలు అంబరాన్నంటాయి. నాలుగో రోజు భ్రమరాంబ సమేతుడైన మల్లికార్జున స్వామివారు మయూర వాహనాదీశులై భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రీశైలం ఆలయం విద్యుత్ దీప కాంతులతో మిరిమిట్లు గొలుపుతూ భక్తులను ఆకట్టుకుంది. ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి అమ్మవారి ఉత్సవమూర్తులను అక్క మహాదేవి అలంకార మండపంలో మయూర వాహనంలో ఆవహింపజేసి అర్చక స్వాములు వాహన పూజలు నిర్వహించి ప్రత్యేక హారతులు ఇచ్చారు. అనంతరం శ్రీస్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను విద్యుత్ దీప కాంతుల నడుమ కన్నుల పండువగా గ్రామోత్సవానికి తరలి వెళ్లారు. రాజగోపురం గుండా మయూర వాహనాదీశులైన శ్రీస్వామి అమ్మవార్లను ఊరేగింపుగా బాజా బజంత్రీల నడుమ బ్యాండ్ వాయిద్యాలతో అంగరంగ వైభవంగా శ్రీశైలం పురవీధుల్లో ఊరేగించారు. మయూర వాహనంపై స్వామి అమ్మవార్లు విహరిస్తుండగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కనులారా దర్శించుకున్నారు. కర్పూర నీరాజనాలు అర్పించారు. ఉత్సవ మూర్తుల ముందు కళాకారుల ఆట పాటలు, నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ మయూర వాహన సేవ పూజ కైంకర్యాలలో తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ సతీమణి స్వర్ణలత రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం దంపతులు పాల్గొన్నారు. శ్రీశైలం శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వారికి దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఆలయ ఈఓ లవన్న తమ వ్యక్తిగతంగా శ్రీస్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులకు దేవస్థానం అధికారులకు శ్రీశైలం ఆలయ ఈవో లవన్న ఛైర్మన్ అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్ల పట్టువస్త్రాలకు శ్రీశైల దేవస్థానం ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులిచ్చారు. మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రదక్షణలు నిర్వహించి శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవారికి శాస్త్రోక్తంగా పట్టు వస్త్రాలు సమర్పించి శ్రీ స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆదివారం జరిగే బృంగి వాహన సేవ లో మంత్రి దంపతులు పాల్గొన్నారు.

# 21 నుంచి యాదాద్రి బ్రహ్మోత్సవాలు..

**నల్గొండ :**

యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముహూర్తం ఖరారైంది. ఈనెల 21 మాఘ శుద్ధ పాడ్యమిన స్వస్తివాచనం, అంకురారోపణం, విశష్వక్సేనారాధన, రక్షాబంధనంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. మార్చి 3వరకు అత్యంత వైభవోపేతంగా సాగే వేడుకల్లో 27న ఎదుర్కోలు, 28న స్వామివారి తిరుకల్యాణోత్సవం, మార్చి ఒకటిన దివ్య విమాన రథోత్సవం నిర్వహించనున్నారు. నాలుగు రోజులపాటు అలంకార సేవలు చేపట్టనున్నారు. కల్యాణోత్సవంలో సీఎం కేసీఆర్ దంపతులు పాల్గొని.. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. కేసీఆర్ సంకల్పంతో రూ.1,250 కోట్లతో మహాద్భుతంగా రూపుదిద్దుకున్న ప్రధానాలయం పునఃప్రారంభం అనంతరం వస్తున్న తొలి బ్రహ్మోత్సవాలు అవడంతో కనీవినిఎరుగని రీతిలో నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌చార్జి ఈఓ రామకృష్ణారావు తెలిపారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 కోట్ల నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. కల్యాణోత్సవాన్ని గతంలో మాదిరి కాకుండా ఈసారి కొండపైన తిరుమాఢవీధుల్లో నిర్వహించనున్నట్లు చెప్పారు. పది వేల మంది భక్తులు కూర్చుని వీక్షించే విధంగా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఇక ప్రధానాలయం ప్రాంగణంలోనే స్వామి, అమ్మవార్ల తిరు కల్యాణోత్సవం చేపట్టనున్నారు. ప్రధానాలయం ఉత్తర ప్రాంతంలోని వాయుదిశలో నిర్మించిన లిఫ్ట్, రథశాల ప్రాంతంలో కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈనెల 28న రాత్రి 8 గంటలకు తిరు కల్యాణోత్సవం జరుపనుండగా అదే రోజు ఉదయం 9 గంటలకు శ్రీరామ అలంకారం, రాత్రి 8 గంటల నుంచి గజవాహన సేవ నిర్వహించనున్నారు. దీని కోసం 56 ఫీట్ల పొడవు, 28 ఫీట్ల వెడల్పుతో ప్రత్యేక కల్యాణ మండపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇక కల్యాణ మండపం ఎదురుగా ఉత్తర మాఢ వీధుల్లో 10 వేల మంది భక్తులు కూర్చునే విధంగా వసతులు కల్పించనున్నారు.. వీవీఐపీ, వీఐపీలతోపాటు కల్యాణంలో పాల్గొనే భక్తులు, అర్చకులు, దోనర్లు, మీడియా కోసం ప్రత్యేకమైన లాబీలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో.. భక్తులకు కల్యాణతంతు స్పష్టంగా కనినిపించే విధంగా 8 ఎల్ఈడీ స్క్రీన్లను బిగించనున్నారు. లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం చేయించుకునే భక్తులకు రూ. 3,000 టికెట్ ధరను నిర్ణయించారు. లక్ష్మీనరసింహస్వామి కల్యాణం అనంతరం దాతలకు శేష వస్త్రంగా ఒక ఉత్తరీయం, కనుము, అభిషేకం లడ్డూ, 2 వడలు ప్రసాదంగా ఇవ్వనున్నారు. ఇక గతంలో స్వామివారి కల్యాణం ఉదయం కొండకింద పాత హైస్కూల్ మైదానంలో నిర్వహించేవారు. ఇక పునర్నిర్మాణం అనంతరం ప్రధానాలయంతోపాటు ఆలయ మాఢ వీధులు విశాలంగా ఉండడంతో ఈసారి బ్రహ్మోత్సవాలను కొండపైనే నిర్వహిన్తున్నారు. బ్రహ్మోత్సవాలకు బస్సుల్లో వచ్చే భక్తులకు ఆటంకం కలుగకుండా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నగరంతోపాటు నల్లగొండ, వివిధ ప్రాంతాల నుంచి నుంచి భక్తులు ఎక్కువగా వస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. భాగ్యనగరం- సికింద్రాబాద్ నుంచి ప్రతి అరగంటకు గుట్టకు ఒక బస్సు ఉన్నది. రాష్ట్రంలోని వివిధ డిపోల నుంచి కూడా బస్సులు నడుస్తున్నాయి. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాదగిరిగుట్ట బస్టాండ్ నుంచి కొండపైకి ప్రతి 10 నిమిషాలకు ఒక బస్సును అందుబాటులోకి తీసుకురానున్నారు.

# భారీ టేకాఫ్‌కు ఎయిరిండియా రె'ఢీ'

**ముంబై :**

ఎయిర్ ఇండియాను భారీగా విస్తరించి, పౌర విమానయాన రంగంలో ఆధిపత్య స్థానాన్ని మరింత పటిష్ట పరుచుకునేందుకు టాటా గ్రూప్ ఒక స్ట్రాంగ్ టేకాఫ్ ప్లాన్ వేసింది. టాటా గ్రూప్‌లో భాగమైన ఎయిర్ ఇండియా, ఈ విస్తరణ ప్లాన్‌లో భాగంగా, విమానయాన రంగంలోనే అతి పెద్ద డీల్ కుదుర్చుకుంది. ఎయిర్‌బస్, బోయింగ్ నుంచి మొత్తం 470 విమానాలను ఎయిర్ ఇండియా ఆర్డర్ చేసింది. ఫ్రాన్స్‌కు చెందిన ఎయిర్‌బస్ నుంచి 250 విమానాలు, అమెరికాకు చెందిన బోయింగ్ నుంచి 220 విమానాల కోసం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఆర్డరు మొత్తం విలువ 80 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 6.40 లక్షల కోట్లు) ఉంటుందని మార్కెట్ అంచనా వేసింది.

**ఈ డీల్‌కు ఎందుకు ఇంత ప్రాధాన్యత?**

ఎయిర్ ఇండియా ఒప్పందం జరిగిన తర్వాత, నాలుగు దేశాల ప్రభుత్వాధినేతలు ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు జో బిడెన్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రోన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దీన్ని బట్టి ఈ డీల్ ఎంత పెద్దది, ఎంత ప్రాధాన్యం ఉందన్న విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. అమెరికా అధ్యక్షుడి కార్యాలయం 'వైట్ హౌస్' నుంచి కూడా దీనిపై ఒక ప్రకటన వచ్చింది. ఆ ప్రకటన సారాంశం ఏంటంటే... బోయింగ్ ఓ ఎయిర్ ఇండియా ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఆ ఒప్పందం ప్రకారం బోయింగ్ నుంచి 220 విమానాలను 34 బిలియన్ డాలర్లకు ఎయిర్ ఇండియా కొనుగోలు చేస్తుంది. వీటిలో 190 ః737 ఓజీటీ, 20 ః787, 10 ః777లీ మోడళ్లు ఉన్నాయి. ఒప్పందం ప్రకారం మరో 70 విమానాలను కొనుగోలు చేసేందుకు కూడా ఎయిర్ ఇండియాకు అనుమతి ఉంది. అవకాశం ఉంటుంది. ఈ ఒప్పందం అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్ చేస్తూ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రోన్ అభినందనలు తెలిపారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాలు లాభపడతాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

**ఏ కంపెనీ నుంచి ఏ రకం విమానాలు వస్తాయి?**

బోయింగ్ నుంచి 737 ఓంటీ మోడల్ విమానాలను ఎయిర్ ఇండియా కొనుగోలు చేస్తుంది. ఈ మోడల్‌లో 737-8 ఓ 737-10 ఉంటాయి. 787-9కి చెందిన 20 ఎయిర్‌క్రాఫ్ట్‌లను, 777-9 రకానికి చెందిన 10 విమానాలను కొంటుంది. ఇది కాకుండా, మరో 70 బోయింగ్ జెట్ విమానాల ద్వారా ఎయిర్ ఇండియా తన విమానాలను మరింత ఆకర్షణీయంగా మార్చుబోతోంది. ఈ ఒప్పంద విలువ 34 బిలియన్ డాలర్లు లేదా సుమారు రూ. 2.80 లక్షల కోట్లు. అనుమతి ఉన్న మరో 70 విమానాలను కూడా ఈ సంస్థ నుంచి కొనుగోలు చేస్తే, ఒప్పందం విలువ 5.9 బిలియన్ డాలర్లు లేదా సుమారు రూ.3.76 లక్షల కోట్లకు చేరుతుంది. 777-9 మోడల్‌కు చెందిన 10 విమానాలను కొనుగోలు చేయడం ద్వారా, ప్రపంచంలోని దాదాపు ప్రతి గమ్యస్థానానికి భారతదేశం కనెక్టివిటీని ఎయిర్ ఇండియా పెంచుతుంది. ఎయిర్‌బస్ ఎ350 విమానాలకు రోల్స్‌రాయిస్ ఇంజిన్లు, బోయింగ్ 777, బోయింగ్ 787లకు విమానాలకు జీఈ ఏరోస్పేస్ ఇంజిన్లు, సింగిల్ యాసిల్ విమానాలన్నింటికీ సీఎఫ్ఎం ఇంటర్నేషనల్ ఇంజిన్లు వినియోగిస్తామని ఎయిరిండియా తెలిపింది. 220 విమానాల కోసం బోయింగ్‌తో కుదిరిన డీల్‌లో భాగంగా... మాక్స్ ఎయిర్‌క్రాఫ్ట్‌కు చెందిన 190 విమానాలను, 787 డ్రీమ్‌లైనర్ మోడల్‌కు చెందిన 20 విమానాలను ఆ కంపెనీ ఎయిర్ ఇండియాకు అప్పగించనుంది. ఇది కాకుండా, ఇతర కేటగిరీల విమానాల కోసం ఆర్డర్లు ఉన్నాయి. బోయింగ్ ఎయిర్‌ప్లేన్స్ కూడా ఈ ఒప్పందంపై ట్వీట్ చేసి ఎయిర్ ఇండియాకు స్వాగతం పలికింది. ఈ భారీ ఆర్డర్ ద్వారా, ఎయిర్‌బస్ ఎ350-1000లో ఉపయోగించే ట్రెంట్ ఎక్స్‌డబ్ల్యూబీ-97 ఇంజిన్లను (68+20 ఆప్షన్స్) కొనుగోలు చేస్తారని రోల్స్ రాయిస్ కూడా ప్రకటించింది. ఎ350-900లో ఉపయోగించే 2 ట్రెంట్ ఎక్స్‌డబ్ల్యూబీ-84 ఇంజిన్లను కూడా కొనుగోలు చేస్తారు. అమెరికా అధ్యక్షుడు జో బిడెన్ ఈ ఒప్పందాన్ని చారిత్రాత్మకంగా అభివర్ణించారు. 'ఎయిరిండియా - బోయింగ్ మధ్య ఒప్పందం, కొనుగోలును ప్రకటించడం గర్వంగా ఉంది' అని బిడెన్ అన్నారు. ప్రధాని మోదీతో కలిసి భారత్-అమెరికా మధ్య బంధాన్ని మరింత పటిష్టం చేసేందుకు ఎదురుచూస్తున్నట్లు బిడెన్ చెప్పారు. ఈ ఏడాది చివరి నాటికి ఎయిర్ ఇండియాకు తొలి ఎ350 విమానాన్ని సరఫరా చేస్తామని ఎయిర్‌బస్ తెలిపింది. ఎయిర్‌బస్ నుంచి ఎయిర్ ఇండియా కొనుగోలు చేయనున్న 250 విమానాల్లో... 40 భారీ విమానాలు ఉన్నాయి. ఎయిరిండియా కోసం ఎ350, ఎ320 విమానాలను టాటా గ్రూప్ ఎంపిక చేయడం గర్వకారణమని ఎయిర్‌బస్ కమర్షియల్ అండ్ సౌత్ ఏషియా ప్రెసిడెంట్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ రెమీ మైలార్డ్ అన్నారు. ఇంత భారీ ఆర్డర్‌తో భారత విమానయాన రంగం ముందుకు దూసుకుపోతుందని ఆయన అన్నారు. విమానాల కొనుగోలుకు ఎయిర్ ఇండియా ఆర్డర్లు ఇవ్వడం గత 17 ఏళ్లలో ఇదే తొలిసారి. టాటా గ్రూప్ యాజమాన్యం కిందకు వచ్చిన తర్వాత ఎయిర్ ఇండియాకు ఇది మొదటి ఆర్డర్. టాటా గ్రూప్, 2022 జనవరి 27న ఎయిర్ ఇండియాను కొనుగోలు చేసింది. ఈ ఒప్పందానికి 17 సంవత్సరాల ముందు, అంటే 2005లో 111 విమానాల కొనుగోలుకు ఎయిర్ ఇండియా ఆర్డర్ ఇచ్చింది. అందులో 68 విమానాల ఆర్డర్ బోయింగ్‌కు, 43 విమానాల ఆర్డర్ ఎయిర్‌బస్‌కు అందింది.

# పాడేరులో మంచు ముప్పు

**విశాఖపట్టణం:**

విశాఖ మన్యం.. ప్రకృతి అందాలకు నెలవు. ముఖ్యంగా మంచు అందాలు పర్యాటకులను కట్టిపడేస్తాయి. అందుకే.. సూర్యోదయం సమయంలో మంచు అందాలను ఆస్వాదించేందుకు టూరిస్టులు క్యూ కడుతున్నారు. మంచు కురిసే వేళలో.. ఘాట్ రోడ్డుపై ప్రయాణానికి ఆసక్తి చూపిస్తున్నారు. అయితే.. అవే మంచు అందాలు పర్యాటకుల ప్రాణాలు తీస్తున్నాయి. మంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు పెరిగి.. పర్యాటకుల ప్రాణాలు తీస్తున్నాయి. దీంతో అరకు, బొర్రా గుహలు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ నెల ఒకటో తేదీన కర్ణాటక రాష్ట్రానికి చెందిన ముగ్గురు పర్యాటకులు మన్యం అందాలను తిలకించేందుకు వచ్చారు. డముకు సమీపంలో ఆరో నంబరు మలుపు వద్ద మంచు కారణంగా రహదారి కనిపించక.. కారు లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఓ పర్యాటకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘాట్ రోడ్డులో గతంలో సూచికలు, హెచ్చరిక బోర్డులు ఉండేవి. ప్రస్తుతం ఇవి చాలా చోట్ల కనుమరుగయ్యాయి. ముఖ్యంగా మలుపులు, ప్రమాదకర ప్రదేశాల వద్ద రేడియం స్టిక్కర్లతో గతంలో వీటిని ఏర్పాటు చేశారు. అలాగే రహదారి మధ్యలోనూ రేడియం గుర్తులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇవి ఎక్కడా కనిపించటం లేదు. దీంతో ప్రమాదాలు ఇంకా పెరిగాయి. మన్యంలో చలికాలంలో దట్టంగా పొగ మంచు కురుస్తుంటుంది. ముఖ్యంగా సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు విపరీతమైన మంచు కురుస్తుంటుంది. ఈ వాతారణంలో గడిపేందుకు వచ్చే పర్యాటకులు పలు జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉంది. ముఖ్యంగా రహదారిపై అవగాహన లేకపోవటం.. మంచు కారణంగా ఘాట్ రోడ్డు కనిపించకపోవటం మూలన ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. మంచు కారణంగా దగ్గరగా వస్తే గానీ మలుపులు కనిపించని పరిస్థితి ఉంటుంది. మలుపులతో ఉన్న ఘాట్ రోడ్డు ప్రయాణంపై అవగాహన లేనివారు ప్రమాదాలు కొనితెచ్చుకుంటున్నారు. దీంతో విహారయాత్రలు కాస్త.. విషాద యాత్రలుగా మారుతున్నాయి.

# పానకాల స్వామి ఆలయంలో పోస్టుల కోసం పైరవీలు

**గుంటూరు:**

మంగళగిరి పానకాల లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో మరో వివాదం వెలుగు చూసింది. ఆలయంలో అంతర్గత బదిలీల్లో చేతి వాటం జరుగుతుందని, అర్చకులు చర్చించుకుంటున్న బేరసారాల వీడియో వైరల్ గా మారింది. మంగళగిరి ప్రాంతంలో అత్యంత కీలకమయిన ఆలయం పానకాల లక్ష్మి నరసింహస్వామి వారి ఆలయం. రాజధాని ప్రాంతంలోని ఈ ఆలయంలో అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. కీలకమయిన అధికారి అవినీతికి పాల్పడుతున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇందుకు సంబంధించిన ఆడియోతో పాటుగా వీడియో కూడా వైరల్ అవుతోంది. దొంగ లెక్కలు చూపి దేవుని సొమ్ము అనే భయం లేకుండా ప్రతి నెల లక్షల రూపాయలు సొంత ఖాతాలోకి జమ చేసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు, మొక్కులో భాగంగా ఆలయానికి భారీగా విరాళాలు భక్తులు సమర్పించుకుంటారు. దేవస్థానంలో అన్నదాన విభాగంలో మొదలైన వివాదం కాస్త, అన్ని విభాగాలకు పాకిందని స్థానికంగా చెబుతున్నారు. రోజుకు వంద మంది భక్తులు వచ్చి అన్నదానంలో భోజనం చేస్తుంటే, 300మందికి అన్నదానంలో వడ్డించినట్లుగా లెక్కలు చూపించారని విమర్శలు ఉన్నాయి. ఈ విధంగా రోజుకు ఏడువేల నుంచి 12వేల వరకు స్వాహా చేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఉత్సవాలలో సైతం తప్పుడు బిల్లులను పెట్టి లక్షల రూపాయలు చేతులు మారాయని విమర్శలు వస్తున్నాయి. ఇటీవల దేవస్థానానికి చెందిన అర్చకుడి సమక్షంలో రికార్డయిన ఒక వీడియో ఇప్పుడు వైరల్ గా మారింది. అందులో అంతర్గగంగా ఉన్న వ్యహారాలు, ఆర్థిక వ్యవహారాలు, వసూళ్ళ పర్వంపై చర్చ జరిగింది. అంతర్గంగా కీలక శాఖలో పని చేసేందుకు పోస్టింగ్ కోసం 50వేల రూపాయలను దేవస్థానం అధికారి బేరం పెడితే అందులో 40వేల రూపాయలకు బేరం ఫైనల్ అయినట్లుగా ఆడియోలో చెబుతున్నారు. దీన్ని బట్టి చూస్తే ఆలయంలో జరుగుతున్న అవినీతి వ్యవహారాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం అవుతుందని భక్తులు మండిపడుతున్నారు. మంగళగిరి శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయ అధికారి రామకోటి రెడ్డిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడిన ఆడియో వీడియో సామాజిక మాధ్యమాలలో వైరల్ అయ్యాయి. అయితే ఆ ఆడియో, వీడియోలు అవాస్తవమని, ఆ అధికారి ఖండిస్తున్నారు. కరోనా సమయంలో వీడియో బయటకు వచ్చిందని, అప్పుడు తాను విధుల్లో లేనని అంటున్నారు. ప్రధాన అర్చకులు మాట్లాడిన ఆడియో వీడియో నిజమైనదా తేల్చాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆలయ అధికారిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు, ఏసీబీ అధికారులు విచారించి అవినీతి జరిగి ఉంటే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సంబంధిత శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు నోరు మెదపాలని.. దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న అవినీతిని ఆరోపణలపై విచారణ చేసి భవిష్యత్తులో ఆలయ సొమ్ము స్వాహా కాకుండా కాపాడాల్సిన బాధ్యత పాలకులు, అధికారులపై ఉందని అంటున్నారు. మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అధికారిగా చెబుతున్న ఆడియో, వీడియో బయటకు రావటంతో దేవాదాయ శాఖ అధికారులు అంతర్గత విచారణ ప్రారంభించారని చెబుతున్నారు. దేవస్థానంలో అంతర్గత పోస్ట్ కోసం వేల రూపాయలు చేతులు మారటం వెనుక గల అసలు విషయాలు వెలుగులోకి తీసుకువచ్చేందుకు ఉన్నతాధికారులు కమిటిని నియమించాలని స్థానికులు, భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

# సీబీఐ వ్యూహాత్మక మౌనం...

**హైదరాబాద్ :**

సంచలనం సృష్టించించిన ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో హైకోర్టు సింగిల్ బెంచ్, డివిజన్ బెంచ్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా సీబీఐ ఇంకా చార్జ్ తీసుకోలేదు. చివరికి సుప్రీంకోర్టులోనూ ఈ అంశంపై సీబీఐకి ఎలాంటి ఆటంకాలు రాలేదు. అయినా ఈ విషయంలో సీబీఐ వీలైనంత వరకూ సైలెన్స్ పాటిస్తోంది. కేసుకు సంబంధించిన పత్రాలివ్వాలని లేఖలు రాయడం తప్ప ఏమీ చేయడం లేదు. సుప్రీంకోర్టులోనూ క్లారిటీ వచ్చిన తర్వాత దూకుడు చూపిద్దామని ఆగుతోందా ? లేకపోతే ఇతర కారణాలతో సైలెంట్ అవుతున్నారా? ఎమ్మెల్యేల ఎర కేసు కు సంబంధించిన ఫైళ్లను సీబీఐకి వెనువెంటనే అంద జేయాలని హకోర్టు తీర్పు వెలువరించి పది రోజులు దాటింది. ఐదు సార్లు లేఖలు రాశామని సీబీఐ మీడియాకు లీకులిచ్చింది. కానీ ఫైల్స్ మాత్రం సీబీఐకి అందలేదు. అలాగని సీబీఐ ప్రత్యామ్నాయ మార్గాన్నీ చూసుకోలేదు. సైలెంట్ గా ఉండిపోయింది. నేరుగా బీజేపీ పెద్దలకు ముడి పెట్టేందుకు తెలంగాణ సిట్ చేసిన ప్రయత్నం ఈ కేసులో ఉన్నందున సీబీఐ కూడా ... తాము అత్యుత్సాహం చూపించామన్న అభిప్రాయం కలగకుండా ఇలా వీలైనంత వరకూ ... అన్ని అవకాశాలు పరిశీలిస్తోందన్న చర్చ జరుగుతోంది. ఈ కేసు విషయంలో సీబీఐ విచారణపై స్టే తెచ్చుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలపై 17వ తేదీన క్లారిటీ వస్తుంది. ఆ రోజున సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే ఇస్తే ఇక సీబీఐ రంగంలోకి దిగాల్సిన పని ఉండదు. ఒక వేళ వాయిదా పడినా... ఎలాంటి ఆదేశాలు రాకపోయినా సీబీఐ దూకుడు చూపించే అవకాశం ఉంది. 17వ తేదీ తర్వాత ప్రభుత్వం నుంచి స్పందన రాకపోయినా నేరుగా కదన రంగంలోకి దిగాలని సీబీఐ నిర్ణయించుకున్నట్లుగా చెబుతున్నారు. ప్రభుత్వం ఇవ్వాల్సిన ఫైళ్ళతో సంబంధం లేకుండా ముందుకు వెళ్లాలని సీబీఐ ఢిల్లీలోని ప్రధాన కార్యాలయం ఉన్నతాధికారులు మౌఖిక ఉత్తర్వులు జారీ చేసినట్టు ప్రచారం జరుగుతోంది. - ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రానిపక్షంలో దూకుడుగా వ్యవహరించాలని సీబీఐ అధికారులు నిర్ణయించారని ఉన్నతాధికారులు న్యాయ సలహాలు కూడా తీసుకున్నారని అంటున్నారు. భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు పైలట్ రోహత్ రెడ్డి (తాండూరు), గువ్వల బాలరాజు(అచ్చంపేట), బీరం చహర్షవర్ధన్ రెడ్డి(కొల్లాపూర్), రేగా కాంతారావు(పినపాక)లు ప్రధానంగా ట్రాప్ చేశారు. వీరిని మొదటగా ప్రశ్నించేందుకు సీబీఐ సిద్ధమవుతున్నట్లుగా అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం ఫైళ్లు ఇస్తే సరేసరి లేని పక్షంలో చివరి అస్త్రాన్ని ప్రయోగించాలన్న పట్టుదలతో సీబీఐ ఉన్నట్టు చెబుతున్నారు. 17వ తేదీ తర్వాత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిపై కోర్టు ధిక్కరణ పిటీషన్ దాఖలు చేయాలన్న అంశంపై కూడా సీబీఐ సమాలోచనలు జరుపుతున్నట్లుగా చెబుతున్నారు. ఈ కేసు అటు బీజేపీకి.. ఇటు బీఆర్ఎస్ పెద్దలకు అత్యంత ప్రతిష్టాత్మకం. అందుకే పదిహేడో తేదీ తర్వాత కీలక పరిణామాలు ఉంటాయని అంచనా వేస్తున్నారు.

# 19 లక్షల మందికి కిసాన్ సమ్మాన్

**కాకినాడ :**

దేశంలో ఉన్న రైతులందరికీ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కిసాన్ సమ్మాన్ నిధి కింద డబ్బులు అందజేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ పథకం కింద చాలా మంది రైతులు లబ్ధి పొందడం లేదు. ఏటా లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వస్తోంది. సాగుభూమి ఉన్న రైతులందరికీ పీఎం కిసాన్ కింద ఏటా 6 వేల రూపాయల పెట్టుబడి సాయం అందిస్తామన్న కేంద్రం.. ఈ కేవైసీ నిబంధనలు పెట్టడంతో వేలాది మంది రైతులు ఈ పథకానికి అర్హత కోల్పోతున్నారు. ఈ పథకానికి అర్హత పొందేందుకు ఈ కేవైసీని తప్పనిసరి చేసింది. ఏటా జనవరిలో మూడో విడత పీఎం కిసాన్ నిధులు విడుదల చేస్తున్న కేంద్రం ఈ కేవైసీ పూర్తి కాలేదన్న నెపంతో చెల్లింపులు జరపడం లేదు. రైతుల ఈ కేవైసీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రామ వ్యవసాయ, ఉద్యాన, పట్టు సహాయకులను నియమించింది. అయితే ప్రభుత్వం ఆర్బీకేల్లో ధాన్యం సేకరణ, ఈ కేవైసీ ప్రక్రియలో జాప్యం జరుగుతోందని చెబుతున్నారు. ఈ కేవైసీ ప్రక్రియ పూర్తి చేయడానికి ఇప్పటికే మూడుసార్లు గడువును పొడిగించారు. తాజాగా ఈనెల 15వ తేదీన తుది గడువుగా నిర్ణయించారు. అయినా ఇప్పటికీ ఈ ప్రక్రియ పూర్తి కాలేది సమాచారం. ఈ కేవైసీ పూర్తి కాకపోతే పీఎం కిసాన్ సమ్ము రైతుల ఖాతాల్లో పడదని కేంద్ర ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. పీఎం కిసాన్ 13వ విడతకు అర్హులైన రైతుల ఖాతాల్లో మార్చి 8వ తేదీ హోలి పండుగనాడు డబ్బులు జ మ చేయనున్నట్లు సమాచారం. అయితే పీఎం కిసాన్ పథకం కోసం రాష్ట్రంలో 60 లక్షల మందికి పైగా రైతులు రిజిస్టర్ చేసుకున్నారు. ఇప్పటి వరకు కేంద్రం 12 విడతలు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. మొదట్లో 50 లక్షల మందికి పైగా లబ్ధి పొందగా ఆ తర్వాత ఈ సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఏపిలో 60,77,808 మంది పథకానికి నమోదు చేసుకోగా 2022-23లో ఏప్రిల్-జులై మాసాలకు 46,62,768 మందికి జమ పడింది. ఆగస్టు-నవంబర్ కు 27,55,285 మందికే ఇప్పటి వరకు జమ పడింది. రిజిస్టరైన వారిలో సుమారు 33 లక్షల మందికి పడలేదు. ముందటి కిస్తు పడ్డ వారిలో 19 లక్షల మందికి కోత పడింది. అంతకు ముందు లబ్ధిదారుల్లో 20 లక్షల మంది తగ్గారు. ఇంత భారీగా ఎందుకు తగ్గుతారన్నదానిపై స్పష్టత లేదు. ఏపీలో కావాలేన తగ్గిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా వ్యవసాయదారులకు రైతు భరోసా పథకాన్ని పీఎం కిసాన్‌తో కలిపి అమలు చేస్తోంది. రెండు పథకాలకూ కలిపి లబ్ధిదారులను రాష్ట్రమే నిర్ణయిస్తోంది. ఏడాదిలో రైతులకు మూడు విడతల్లో మొత్తం రూ.13,500 అందాలి. మేలో ఇచ్చే తొలి కిస్తు రూ.7,500లో రాష్ట్రం 5,500, కేంద్రం 2,000 ఇవ్వాలి. నవంబర్‌లో ఇచ్చే రెండవ కిస్తులో రాష్ట్రం 2 వేలు, కేంద్రం 2 వేలు ఇవ్వాలి. మూడవ కిస్తు 2 వేలనూ కేంద్రమే ఇస్తుంది. అందులో రాష్ట్ర వాటా లేదు. భూమి యజమానులకు రాష్ట్రం ఇచ్చే సాయం పడుతోంది తప్ప కేంద్రం ఇచ్చేది సకాలంలో పడట్లేదు. లక్షలాది మంది రైతులు కేంద్ర సాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఇలాంటి రైతులకు ఏపీ ప్రభుత్వం అయినా జమ చేస్తుందా అంటే.. అదీ చేయడం లేదు. దీంతో రైతులు నష్టపోతున్నారు.

# విశాఖ రాజధాని అంత వీజీ కాదు

**విజయవాడ :**



దిల్లీ వేదికగా సీఎం జగన్ ఆంధ్రప్రదేశ్ రాజధాని విశాఖపట్టణం అని, త్వరలోనే తాను కూడా అక్కడకు షిఫ్ట్ అవుతున్నానని ప్రకటించారు. అయితే ఈ అంశంపై తెలుగు రాష్ట్రాల్లో చర్చ మొదలైంది. వరుసగా పార్టీ నేతల్లో చర్చ మొదలైంది. అది అలా అయితే ఇది ఎలా...అబ్బే అది సాధ్యం కాదంటూ, కాదు సాధ్యమేనంటూ ఎవరికి వారు వాదనలు మొదలుపెట్టేశారు. ఆ విషయాలు ఏంటంటే... విశాఖపట్టణం రాజధాని అని సీఎం జగన్ ప్రకటించారు. ఆయన చెప్పాక ఇంకెవరు ఏం మాట్లాడతారు. అదే జరుగుతుందని కొందరు నేతలు అంటుంటే, ఇదే సమయంలో ఎవరి వాదనలు వారు వినిపిస్తున్నారు. రాజధానికి వెళ్లాలంటే, అంతకు ముందు జరగాల్సిన వ్యవహారాలు అన్నీ ఆశామాషీ కాదు కదా అని ప్రశ్నిస్తున్నారు. దీనికి కొందరు అవును అంటూనే, ముఖ్యమంత్రి రేంజ్ లో జగన్ వెళ్లి విశాఖపట్టణంలో కుర్చుంటే, మిగిలినవి వాతంతట అవే వస్తాయంటూ, పార్టీ నేతలు కొందరు ధీమాగా చెబుతున్నారు. అయితే కొందరు ఈ విషయానికి నిజమే అంటూనే అంత ఈజీనా అంటూ సందేహాన్ని కూడా వెలిబుచ్చుతున్నారు. సచివాలయం, అందులోని హెచ్ఓడీలు, వివిధ శాఖలు, దిగువ స్థాయి అధికారులు, సిబ్బంది, ఇలా అందరూ తట్టాబుట్టా సర్దుకొని, బెజవాడ నుంచి విశాఖపట్టణానికి వెళ్లటమా..అంటూ ఊహల్లోకి వెళు తున్నారు. రాజధాని ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి వెళ్లడం పెద్ద ప్రాసెస్.. ఎన్నికల ముందు సీఎం ఈ ప్రాసెస్ ను అమలుచేయటం అంత ఈజీనా అంటూ కొందరు అధికారులు సైతం, తమను కలిసిన పార్టీ ముఖ్య నేతల వద్ద సందేహాలు చెబుతున్నారంట. రాజధాని తరలింపు వ్యవహారంపై ప్రభుత్వ వర్గాలు అప్పుడు ఇప్పుడూ అంటూ రోజులను గుర్తు చేసుకుంటున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత 2014లో హైదరాబాద్ నుంచి విజయవాడకు షిఫ్ట్ అవ్వటానికి జరిగిన ప్రయత్నాలు గురించి ఆలోచిస్తున్నారు. అప్పట్లోనే అత్యంత క్లిష్టంగా హైదరాబాద్ నుంచి విజయవాడకు వచ్చారు. విజయవాడలో తాత్కాలిక కార్యాలయాలు, అద్దెకు ఇళ్ళు వెతుక్కున్నారు. అదే సమయంలో అమాంతంహా పెరిగిన ఇళ్ల అద్దెలు, అప్పటి సీఎం చంద్రబాబు ఇంటి అద్దెల పెంపుపై ఆగ్రహం వ్యక్తం చేయటం...ఇలాంటి పదనిసలు అన్నీ ఇప్పుడు మరోసారి గుర్తుకు వస్తున్నాయి. సీఎంగా ఉన్న వ్యక్తి రాజధాని అంటూ విశాఖపట్టణానికి వెళ్లి అక్కడ నుంచి పని చేయటానికి ముందు కూడా కొన్నిసదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. ప్రధానంగా సీఎంవో అధికారులకు ఏర్పాట్లు జరగాలి, ఆ తరువాత సీఎంకు ప్రత్యేక సదుపాయాలు, భద్రత వంటి అంశాలు అత్యంత కీలకం.. ఇదే సమయంలో దేశ విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులు, వారికి అందాల్సిన సదుపాయాలు, ప్రోటోకాల్, వంటి తతంగాలు, అంతర్జాతీయ స్థాయిలో మన రాష్ట్రాన్ని గుర్తించే విధంగా వాతావరణం ఏర్పాటు చేయటం...ఇలా ప్రతిది సవాలే. హైదరాబాద్ నుంచి విజయవాడకు ఆంధ్రప్రదేశ్ రాజధాని మార్పు చేసిన సమయంలో చాలా మంది ఉద్యోగులు, విజయవాడకు వచ్చారు కాని, వారి మనస్సులు మాత్రం ఇప్పటికి హైదరాబాద్ చుట్టూనే తిరుగుతున్నాయి. వీకెండ్ వచ్చిందంటే చాలు, ఆంధ్రప్రదేశ్ సచివాలయం పూర్తిగా బోసిబోతుంది. అధికారులు అంతా హైదరాబాద్ కు వెళ్ళిపోతారు. అక్కడ వాతావరణానికి ,విజయవాడ లో వాతావరణానికి చాలా వ్యత్యాసం ఉండటం కూడా ఇందుకు ప్రధాన కారణమని అంటుంటారు. ఇలాంటి పరిస్థితులు చాలా వెంటాడుతున్న సమయలో ఇప్పుడు మరోసారి విశాఖపట్టణానికి రాజధాని అని జగన్ చేసిన కామెంట్స్ తో ఏపీ ప్రజల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది.

# కట్టెల బూడిద రూ.1800

**ముంబై :**

గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కట్టెల పొయ్యిపైనే ఆహారాన్ని వండుతుంటారు. గ్యాస్ వినియోగం అధికమైనా.. కొందరు పాత కాలపు పద్ధతులనే పాటిస్తుంటారు. అయితే.. కట్టెల పొయ్యిపై ఆహారాన్ని వండటం చాలా రిస్క్ తో కూడుకున్న వ్యవహారం. పాత్రలను శుభ్రం చేయడం, పొయ్యి నుంచి వచ్చే పొగ తీవ్ర అనారోగ్య సమస్యలు కలిగిస్తుంది. ఒకప్పుడు చాలా ఇళ్లలో కట్టెల పొయ్యిపైనే ఆహారం వండుకునేవారు. ఎందుకంటే అప్పట్లో గ్యాస్ స్టవ్ లభ్యత చాలా తక్కువగా ఉండేది. కిరోసిన్ ను కూడా ఉపయోగించే వారు. వంట అంతా అయిపోయిన తరువాత.. కట్టెల పొయ్యిలో పొగ పొగవుతుంటుంది. వాటిని తీసి పడేయడమో లేక గిన్నెలు శుభ్రం చేసేందుకో ఉపయోగిస్తుంటారు. ప్రస్తుతం దీని గురించి టాపిక్ ఎందుకు అనుకుంటున్నారా.. ఎందుకుంటే.. యాష్ కు సంబంధించిన ఓ పోస్ట్ ఇంటర్నెట్ లో తెగ హల్ చల్ చేస్తోంది. బాబా రామ్‌దేవ్.. అమెజాన్ లో అమ్మకానికి ఉంచిన బూడిద ప్యాకెట్ స్క్రీన్‌షాట్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇందులో 250 గ్రాముల ఈ ప్యాకెట్ ధర రూ.450గా, అంటే దీని ప్రకారం, ఒకదాని ధర



కిలో చుల్హా బూడిద రూ.1800. ఈ బూడిదను ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్ అమెజాన్‌లో విక్రయిస్తున్నారు. బూడిదకు ఇంత ఎక్కువ ధర పలకడం చూసి బాబా రామ్‌దేవ్ కూడా ఆగ్రహానికి గురయ్యారు. మన పూర్వీకులు పాత్రలు కడగడానికి ఉపయోగించే పొయ్యి బూడిదను మొదట అశాస్త్రీయంగా పిలిచి ఎగతాళి చేశారు. క్యాన్సర్ వంటి వ్యాధులకు కారణమయ్యే రసాయనాల డిష్‌వాష్‌ను ఉపయోగించడం అలవాటు చేసుకున్నారని మండిపడ్డారు. బాబా రామ్‌దేవ్ చేసిన ఈ పోస్ట్‌ను ఇప్పటివరకు 1 మిలియన్ పైగా వ్యూస్ వచ్చాయి. వేల సంఖ్యలో నెటిజన్లు పోస్ట్ ను లైక్ చేశారు. అంతే కాకుండా పోస్ట్ చూసిన తర్వాత తమ అభిప్రాయాలను కామెంట్ల రూపంలో రాస్తున్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

## పట్టాలు తప్పిన గోదావరి ఎక్స్ ప్రెస్

**భువనగిరి యాదాద్రి**



విశాఖ పట్నం నుంచి సికింద్రాబాద్ వస్తున్న గోదావరి ఎక్స్ ప్రెస్ బుధవారం తెల్లవారుజామున బీబీనగర్ ఘట్కేసర్ స్టేషన్ల మధ్య దగ్గర పట్టాలు తప్పింది. ఘటనలో ఆరు కోచులు పట్టాలు తప్పాయి. ఎస్ 1, ఎస్ 4, జనరల్, ఎస్-ఎల్ఆర్ కోచులు పట్టాలు తప్పాయి. ఘటనలో ఎవరికీ ఏమీ కాలేదు. ప్రమాదానికి గురయిన కోచులను తప్పించి మిగతా రైలును సికింద్రాబాద్ కు పంపించారు.

## జగిత్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదం

**జగిత్యాల**

జగిత్యాల - కరీంనగర్ ప్రధాన రహదారిపై లారీ, ఆర్టీసి బస్సు ఢీకొన్నాయి. బుధవారం ఉదయం కొండగట్టు సమీపంలోని బల్వంతాపూర్ వద్ద ఘటన జరిగింది. ఈ రోడ్డు ప్రమాదంలో బస్సు కండక్టర్ అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సులో ప్రయాణిస్తున్న ఎనిమిది మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

## రోడ్డు ప్రమాదంలో కండక్టర్ మృతి

**కరీంనగర్**



కరీంనగర్ జిల్లా కొండగట్టు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న ఘటనలో కండక్టర్ మృతి చెందగా ఎనిమిది మంది ప్రయాణికులు గాయపడ్డారు. వారిని హుటాహుటిన జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జగిత్యాల నుంచి వరంగల్ వెళుతున్న బస్సు ప్రమాదానికి గురికాగా బస్సులో 8 మంది ప్రయాణికులున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ రోజు సీఎం కేసీఆర్ కొండగట్టు పర్యటన ఉండగా కొద్ది దూరంలోనే ఈ ప్రమాదం చోటు చేసుకుంది. మృతి చెందిన కండక్టర్ కొడిమ్యాల మండలం శ్రీరాములపల్లి కు చెందిన సత్తయ్య గా గుర్తించారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యం

**సర్పవరం**

ప్రతి ఒక్కరూ ప్రోటీన్లు ఉండే సమతుల ఆహారం తీసుకోవాలని అప్పుడే ఆరోగ్యం మెండుగా ఉంటుందని పోషకాహార నిపుణురాలు మల్లీశ్వరి పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ లో బోట్ క్లబ్ వాకర్స్ సంగం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రోటీన్లు ఉండే ఆహారం శరీరానికి అవసరమైన విటమిన్ ,మినరల్స్ అందిస్తాయని అన్నారు. అన్నం కంటే కూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. పండ్లు, మంచినీరు అధికంగా తీసుకోవాలని అన్నారు . సరైన ఆహారం తీసుకోకపోతే వయసు పెరిగికొద్ది దీర్ఘకాలిక రోగాల బారిన అవకాశం ఉందని మల్లీశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు, రవిశంకర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సింధు శంకర్ కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నేతలు

**సంగారెడ్డి**

పటాన్ చెరు నియోజకవర్గం పటేల్ గూడ, బిహెచ్ ఈ ఎల్ మెట్రో ఎన్ క్లేవ్ లో నివాసముంటున్న పీసీసీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ సింధు శంకర్ గుండెపోటుతో ఇటీవల అకస్మిక మృతి చెందాడు. ఈ నేపథ్యంలో బుధవారం నాడు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మాణిక్ రావ్ ధాక్రే , ఏఐసీసీ శెక్రటరీ బోస్ రాజు, నదీం జావీద్, పీసీసీ ఉపాధ్యక్షులు వేణుగోపాల్ రావు, పిసీసీ ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్, పిసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్, యం ఏ ఫహీం, జైపాల్, పటాన్ చెరు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ తదితరులు అయన కుటుంబాన్ని పరామర్శించారు

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

**నల్గోండ**

నల్లగొండ జిల్లా నార్కట్ పల్లి శివారులో రోడ్డుప్రమాదం జరిగింది.లారీని బైక్ ఢీకొనడంతో.. బైకిస్ట్ అశోక్ స్పాట్ లోనే మృతి చెందాడు. నల్లగొండ బైపాస్ రోడ్ లో రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో బైక్ లారీని ఢీకొట్టింది. ప్రమాద దృశ్యాలు అక్కడే ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్ పరారయ్యాడు. ఘటనపై కేసునమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# అప్పుల ఊబిలో ఏపీ రైతులు

**విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్ రైతులు అప్పుల ఊబిలో ఉన్నారు. రాష్ట్ర రైతాంగంపై దేశంలోనే అత్యధిక రుణభారం ఉంది. జాతీయ గణాంకాల కార్యాలయం వెలువరించిన వ్యవసాయ కుటుంబాలు, భూమి స్థితి మదింపు నివేదిక 9 ప్రకారం.. దేశంలోనే అత్యధికంగా ఏపీలో ఒక్కో రైతు కుటుంబంపై సగటున రూ.2,45,554 రుణభారం ఉందని తెలిపింది. ఆ తర్వాత రూ.2,42,482 అప్పుతో కేరళ రెండో స్థానంలో ఉంది. రూ.2,03,249 అప్పుతో పంజాబ్ మూడో స్థానంలో ఉంది. తెలంగాణలో ఒక్కో రైతు కుటుంబంపై రూ.1,52,113 అప్పు ఉంది. రైతు కుటుంబాల అప్పుల్లో జాతీయ సగటు రూ.74,121గా ఉంది. ఈ వివరాలను పార్లమెంట్‌లో కేంద్రం తెలిపింది. ఏపీ రైతులకు ఈ దుస్థితి రావడానికి ఏపీ ప్రభుత్వమే కారణమని.. ఏపీ బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి మండిపడ్డారు. అత్యధిక జీఎస్టీ వసూళ్లు సాధిస్తున్నప్పటికీ.. రైతుల పరిస్థితి రోజు రోజుకు దిగజారిపోవడానికి ఏపీ ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. రైతుల పరిస్థితి రోజు రోజుకు దిగజారిపోతూంటే.. సీఎం జగన్ మాత్రం అవినీతి, ఓటు బ్యాంక్ రాజకీయాల్లో బీజీగా ఉన్నారు.కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ విడుదల చేసిన 'సిచ్యుయేషన్ అసెస్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ హౌస్‌హోల్డ్స్ అండ్ ల్యాండ్ అండ్ లైవ్‌స్టాక్ హోల్డింగ్స్ ఆఫ్ హౌస్‌హోల్డ్స్ ఇన్ రూరల్ ఇండియా 2019' నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. హరియాణా, తెలంగాణ, కర్ణాటక, రాజస్థాన్, తమిళనాడుల్లోని రైతు కుటుంబాలపై రూ. 1లక్షకుపైగా రుణభారం ఉంది. మిగిలిన అన్ని రాష్ట్రాల్లోని రైతులపై సగటు భారం రూ.లక్షలోపే నమోదైంది. ఇది దేశంలో ఒక్కో రైతు కుటుంబం మోస్తున్న రుణ భారంకంటే 231% అధికం. కేంద్రం గణాంకాలపై ఏపీలో రాజకీయ దుమారం ప్రారంభమయింది. రైతు భరోసా పేరుతో పెద్ద ఎత్తున ఆర్థిక సాయం చేస్తున్నామని రైతులంతా సంతోషంగా ఉన్నారని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. కానీ పరిస్థితి వేరుగా ఉందని.. ఇలాంటి నివేదికల ద్వారా వెల్లవుతున్నాయని బీజేపీ నేతలు అంటున్నారు. ఓ వైపు కేంద్రం పూర్తి స్థాయిలో రైతుల ఆదాయం రెట్టింపు చేసేలా ప్రయత్నాలు చేస్తూంటే.. రాష్ట్రంలో మాత్రం కేవలం ఓటు బ్యాంక్ పథకాలు మాత్రమే అమలు చేస్తూ రైతుల్ని గాలికి వదిలేశారని విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వ విధానాల కారణంగానే రైతులు ఇంత తీవ్రమైన అప్పుల్లో కూరుకు పోయారని అంటున్నారు

# విశాఖ వైసీపీలో ఇంటి పోరు

**విశాఖపట్టణం :**

విశాఖలో తూర్పు నియోజకవర్గం రాజకీయాలు చాలా ప్రత్యేకం. 2009 తర్వాత టీడీపీ గట్టి పట్టు సాధించింది. వెలగపూడి రామకృష్ణబాబు వరుసగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. వెలగపూడిని ఓడించేందుకు ఒకసారి ప్రజారాజ్యం, రెండుసార్లు వైసీపీ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇప్పుడు అధికారపార్టీ వైనాట్ 175 అంటోంది. టీడీపీ గెలిచిన స్థానాలపై ఫోకస్ పెట్టింది. ఆ జాబితాలో ఉన్నదే తూర్పు నియోజకవర్గం. కాపు, యాదవ, మత్స్యకార, బ్రాహ్మణ సామాజికవర్గాలు ఇక్కడ బలమైనవి. బీసీలకు ప్రాధాన్యం ఇచ్చి ఎమ్మెల్యే దూకుడికి బ్రేకులు వేయాలని భావించింది వైసీపీ. 2019లో పోటీ చేసి ఓడిన అక్కరమాని విజయ నిర్మలను నియోజకవర్గ కోఆర్డి నేటర్‌గా కొనసాగిస్తూనే.. కీలకమైన ఎఓభీఆం చైర్మన్‌ను చేసింది. తొలిసారి కార్పొరేటర్‌గా గెలిచిన గోలగాని హరి వెంకట కుమారికి మేయర్ పీఠం కట్టబెట్టింది. సీనియర్ నాయకుడు వంశీకృష్ణ యాదవ్ ఎమ్మెల్సీ అయ్యారు. ఒకే సామాజికవర్గానికి పదవులు ఇవ్వడంపై పార్టీలోని ఇతర వర్గాలు అసంతృప్తితో ఉన్నా హైకమాండ్ మాత్రం దీర్ఘకాలిక ప్రయోజనాలను ఆశించింది.నేతలకు పదవులు కట్టబెట్టినా తూర్పులో వైసీపీకి ఆశించినస్థాయిలో ఊపు రాలేదనే చర్చ ఉంది. దీనికి కారణం వర్గ రాజకీయాలే. మేయర్ కుమారి, అక్కరమాని మధ్య నెలకొన్న ప్రచ్ఛన్న యుద్ధం డైరెక్ట్ ఫైట్‌గా మారింది. ఆధిపత్యం కోసం అక్కరమాని నేరుగా సీఎంకి ఫిర్యాదు చేశారనే ప్రచారం జరిగింది. ఇదే సమయంలో గతంలో తూర్పు ఇంఛార్జ్‌గా పనిచేసిన ఓఒఅ వంశీకృష్ణ సైతం టికెట్ ఆశిస్తున్నారు. అక్కరమాని రాజకీయాలను అంగీకరించేది లేదని ప్రకటించి.. ఆమె నిర్వహించే కార్యక్రమాలకు వంశీ వర్గం దూరమైం ది. ఈ సమస్యలు పరిష్కరించేందుకు పలుమార్లు హైకమాండ్ సమన్వయ కమిటీ సమా వేశాలు పెట్టినా గ్రూపు రాజకీయాల రచ్చ చల్లారలేదు.ఈ పరిస్థితి ఎక్కువ కాలం కొనసాగితే పార్టీకి జరిగే నష్టాన్ని గుర్తించి ఈస్ట్‌లో కొత్త యాక్షన్ ప్లాన్ షురూ చేసింది అధిష్ఠానం. ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను ఎంచుకుంది. ఈసారి ఎంపీగా కంటే ఎమ్మెల్యేగా పోటీ చేసి వెలగపూడిపై గెలిస్తే.. పార్టీ పవర్‌లోకి వస్తే ప్రమోషన్ ఉంటుందనే అంచనాల్లో ఉన్నారు ఓఎం. తూర్పులో ఉన్న నాయకులు, కేడర్ కు దగ్గరయ్యే చర్యలు ప్రారంభించారు ఎంపీ. కుమారుడు వివాహ రిసెప్షన్‌లో తూర్పు కేడర్, లీడర్లకు ప్రయారిటీ లభించిందట. ఒకటి రెండు నెలల్లో ఎంవీవీని కోఆర్డినేటర్‌గా ప్రకటిస్తారని అనుకుంటున్నారు. గడప గడపకు బాధ్యతలను అప్పగించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయట.అధిష్ఠానం మూడ్ తెలుసుకున్నాక తూర్పు వైసీపీలోని మూడు గ్రూపులు అలెర్ట్ అయ్యాయి. ఎడముఖం పెడముఖంగా ఉన్న అక్కరమాని, వంశీకృష్ణ, మేయర్ వర్గాలు ఒక తాటి మీదకు వచ్చేయనే చర్చ సాగుతోంది. సీఎం పాల్గొన్న కార్యక్రమంలో మూడు గ్రూపులు ఐక్యంగా ఉన్నామని కలరింగ్ ఇచ్చాయి. సీటు కోసం కొట్లాడుకుంటే జరిగే నష్టం గుర్తించి ఇటీవల సామాజికవర్గంలో పెద్ద చర్చ జరిగినట్టు తెలిసింది. తమలో సీటు ఎవరికి ఇచ్చిన కలిసి పనిచేయాలని. .ఇప్పుడు అవకాశం కోల్పోతే మళ్లీ రాదనే అభిప్రాయం వ్యక్తమైందట. అలాగని అధినాయకత్వం నిర్ణయాన్ని ధిక్కరించే ధైర్యం వాళ్లకు లేదు. ఈ పరిస్థితుల్లో తమకున్న అవకాశాలను దెబ్బతీయవద్దనే విజ్ఞప్తిని హైకమాండ్ దగ్గరకు తీసుకుని వెళ్లే ప్రయత్నాల్లో ఉన్నారట. ఐతే, అభ్యర్థిత్వం మార్పు దాదాపు ఖరారైన తరుణంలో మూడు గ్రూపుల ట్రయిల్స్ ఎంత వరకు వర్కవుట్ అవుతాయో సందేహమే.

# యూనివర్సిటీలో మత్తు మాఫియా కలకలం

**విశాఖపట్నం**




ఆంధ్ర యూనివర్సిటీ డ్రగ్స్ కు అడ్డాగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్యాంపస్ లో గంజాయి అమ్మకం కలకలం సృష్టిస్తుంది .ఇటీవల గంజాయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడిన ముగ్గురు నిందితుల్లో యూనివర్సిటీ సెక్యూరిటీ గార్డు ఉండడం పై ఆందోళన వ్యక్తమవుతోంది.బీచ్ రోడ్ లోని యోగా విలేజ్,మహిళా ఇంజినీరింగ్ కాలేజ్ దగ్గర గంజాయి విక్రయిస్తూ సెక్యూరిటీ గార్డ్ పోలీసులకు చిక్కడం చర్చనీయాంశంగా మారింది.వేలాది మంది విద్యార్థులు చదువుకునే చోట గంజాయి ఆనవాళ్లు బయటపడడం విస్మయానికి గురి చేస్తోంది. యూనివర్సిటీ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలను నిలువరించాల్సిన సెక్యూరిటీ సిబ్బంది గంజాయితో పట్టుబడడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.విశాఖలో డ్రగ్స్ దందా జోరుగా సాగుతుందని అనడానికి ఏయూ ఘటన నిదర్శనం. గతంలో పోలిస్తే ఇటీవల గంజాయి అక్రమ రవాణా విపరీతంగా పెరిగింది. జిల్లా సరిహద్దులను దాటిస్తున్న వారిలో యువతే ఎక్కువగా పట్టుబడుతున్నారు. చాలా చోట్ల గంజాయి సేవిస్తున్న వ్యక్తులను పోలీసులు గుర్తిస్తున్నారు. ఇటీవల పోలీసులు మత్తు ఇంజక్షన్లు కూడా స్వాధీనం చేసుకున్నారు.ఏయూలో మత్తు పదార్థాల విక్రయాలు సాగిస్తున్నాయనే విమర్శలు కొంతకాలంగా వినిపిస్తున్నాయి. గతంలో ఒకసారి యూనివర్సిటీలోని విద్యార్థులు, బయటి కాలేజీ విద్యార్థులు గంజాయి వ్యవహారంలోనే పెద్ద ఎత్తున గొడవపడి పోలీసులకు ఫిర్యాదు చేసుకునే వరకు వెళ్లారు.ఆ తరువాత ఇలాంటి ఘటనలు వెలుగులోకి రానప్పటికీ, యూనివర్సిటీలో గుట్టుగా గంజాయి సరఫరా జరుగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. విద్యా వనంలో గంజాయి దందా సాగుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఏయూలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న చంద్రమౌళి తో పాటు ఆటో డ్రైవర్ సురేష్, సతీష్ ఏయూ పరిసరాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులు దర్యాప్తుల్లో తేలింది. వారిచ్చిన సమాచారంతో మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పోలమాంబ గుడి నుంచి యూనివర్సిటీ వరకు గతంలో దుకాణాలు ఉండేవి. వీటిలో గుట్టుగా గంజాయి విక్రయాలు సాగిస్తున్నాయన్న సమాచారంతో అధికారులు వాటిని తొలగించారు.ఇప్పుడు ఏకంగా సెక్యూరిటీ సిబ్బంది గుట్టుగా గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డారు. యూనివర్సిటీ కేంద్రంగా ఇలాంటి వ్యవహారం సాగుతోందనే విషయం వెలుగులోకి రావడంతో అధికారుల్లో అలజడి మొదలైంది.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

**ఆదిలాబాద్**

మావల మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారి పై ద్విచక్ర వాహనాలపై వస్తున్న ఇద్దరు వ్యక్తులు పరిచయం ఉండడంతో వాహనాలను నిలిపివేసి రోడ్డుపై మాట్లాడుకుంటున్న తరుణంలో ఒక్కసారిగా ఓ లారీ వారిపైకి దూసుకొచ్చింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. అయితే మృతి చెందిన వారు ఎవరు, ప్రమాదం ఎలా జరిగిందో ఇంకా పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు .. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు..

## మంచి నీటి కుళాయితో కొత్త వెలుగులు



**నంద్యాల**

స్థానిక నంద్యాల పట్టణంలో మన నూనెపల్లి మటన్ మార్కెట్ లో చాలా కాలం నుంచి వాటర్ లేక ఇబ్బంది పడుతూ మార్కెట్ చాలా అపరిశుభ్రంగా ఉందని, తెలుసుకొని మన యువ ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే తక్షణమే స్పందించి మటన్ మార్కెట్ పరిశుభ్రంగా ఉండాలని మంచినీళ్ల కుళాయి వేయించారు. . ఈ కార్యక్రమం మన వైయస్సార్ సిపి కార్యకర్తలు అభిమానులు మార్కెట్ వ్యాపారస్తులు కలిసి 23 వార్డ్ ఇంచార్జ్ గాజులపల్లి పార్థుడు మరియు 24 వార్డు ఇంచార్జ్ రహంతుల్లా మరియు అభినేని మోహన్ శిల్పా రమణ గౌతమ్ శీను మహేంద్ర గౌడ్ చిన్న కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన సలహాలందించి వారి వృద్ధికి డీలర్లు దోహదపడాలి

**పెద్దపల్లి**

జిల్లాలో ఉన్న విత్తన, ఎరువుల క్రిమి సంహారక డీలర్లు రైతులకు నాణ్యమైన సలహాలందించి వారి వృద్ధికి దోహదపడాలని, నూతన సాగు విధానాలు, విత్తనాలు, క్రిమి సంహారక, తదితర అంశాల పై పూర్తి అవగాహన పొందాలని జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్టెన్షన్ మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఎక్స్టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్పుట్ డీలర్స్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కోర్సును ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, దేసి కోర్సులో కనీసం 10 ప్రామాణిక పరీక్షలకు హాజరైన ప్రాక్టీస్ చేసే ఇన్‌పుట్ డీలర్‌లందరికీ అందుబాటులో ఉంటుందని, జిల్లాలో ఉన్న 341 డీలర్లలో 170 మంది డిప్లొమా కోర్సు కోసం దరఖాస్తు చేసుకున్నారని, ప్రస్తుత సంవత్సరం 80 మంది డీలర్లను ఎంపిక చేసి 48 వారాల పాటు ప్రత్యేక శిక్షణ అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులను పారా ఎక్స్‌టెన్షన్ నిపుణులుగా మార్చడం ద్వారా క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలను పరిష్కరించడం ఈ కార్యక్రమం ఉద్దేశ్యమని అన్నారు. డిప్లొమా కోర్సు డీలర్ల కోసం ప్రత్యేక ఆలోచనతో రూపొందించడం జరిగిందని, క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన సలహాలు డీలరు అందించాల్సి ఉంటుందని అందుకోసం పరిజ్ఞానం పెంచుకోవాలని కలెక్టర్ తెలిపారు. డీలర్లు అనుభవంతో పాటు శాస్త్రీయ కారణాలతో రైతులకు వివరంగా మంచి సలహాలు చెప్పగలిగితే ఉత్తమమైన ఫలితాలు వస్తాయని, రైతులకు మెరుగైన సేవ చేసినట్లవుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ, ఆత్మ ప్రాజెక్ట్ అధికారి ఆదిరెడ్డి, ఫెసిలిటేటర్ లు రామచంద్రా రెడ్డి, కొమురయ్య, కె.వి.కె. ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్ కె.వి.కె. శాస్త్రవేత్తలు, ఎరువుల, క్రిమి సంహారక డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## వైస్సార్ విగ్రహం ధ్వంసం..ఉద్రిక్తత

**కాకినాడ**

పెద్దాపురం మండలం జె. తిమ్మాపురం గ్రామంలో ఉన్నటువంటి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పెద్దాపురం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున జే.తిమాపురం గ్రామానికి చేరుకున్నారు. జె తిమ్మాపురం గ్రామంలో రోడ్డుపై బైఠాయించి తమ నిరసనను తెలియజేశారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే పట్టుకుని శిక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు ప్రారంభించారు. కేసును త్వరగా విచారించి దోషులకు శిక్షపడేలా చేస్తామని చెప్పారు.

# పొత్తులు లేకుండా ఒంటరేనా

**నెల్లూరు :**

ఆంధ్రప్రదేశ్ లో ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరగబోతున్నాయి. వీటిలో మూడు పట్టభద్రుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. కడప, అనంతపురం, కర్నూలుతో పాటు ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు స్థా?నానికి, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. ఇక టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా జరగనున్నాయి. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు టీచర్ ఎమ్మెల్సీ, కడప, అనంతపురం, కర్నూలు ఉపాధ్యాయ స్థానాలకు ఎన్నికలకు జరగనున్నాయి. ఇక స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నా అవి అధికార పార్టీ సొంతమవుతాయి. ఎందుకంటే స్థానిక సంస్థల్లో వైసీపీదే మెజారిటీ కావడంతో ఆ స్థానాలు ఖచ్చితంగా ఫ్యాన్ పార్టీ ఖాతాలో పడతాయి. ఉపాధ్యాయులు సహజంగానే అధికార పార్టీకి వ్యతిరేకంగా ఉన్నారు. వారిని ఎన్నికల విధుల నుంచి తప్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం, జీతాలు సకాలంలో జమ చేయకపోవడం, పీఆర్సీ తదితర సమస్యలను పరిష?కరించకపోవడంతో ఉపాధ్యాయులు అధికార పార్టీకి దూరంగానే ఉంటారన్న అంచనాలు అయితే ఉన్నాయి. అది నిజం కూడా టీచర్ ఎమ్మెల్సీల్లో గెలుపు సాధించడం అధికార వైసీపీకి అంత సులువు కాదు. ఆ పార్టీకి చెందిన అభ్యర్థులు పంపుతున్న బహుమతులు కూడా వెనక్కు పంపుతున్నారు. ఇక పొత్తులతో 2024లో బరిలోకి దిగుతామంటున్న పార్టీలు కూడా ఈ ఎన్నికల విషయంలో కిమ్మనడం లేదు. ఈ ఎన్నికలను పెద్దగా పట్టించుకోవడం లేదు అంటే అలా అనుకోవడానికి లేదు. టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీలు గెలిచే అవకాశాలు విపక్షాలుకు పుష్కలంగా ఉన్నాయి. గతంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీకి చెందిన మాధవ్ గెలిచారు. తిరిగి అక్కడి నుంచే గెలిచేందుకు మాధవ్ మరసారి బరిలోకి దిగుతున్నారు. కానీ జనసేన ఇంత వరకూ మాధవ్ కు బహిరంగంగా మద్దతు ప్రకటించలేదు. కానీ బీజేపీ మాత్రం తమతో జనసేన కలసి వస్తుందని చెప్పు?కుంటున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కావడంతో యువత ఓట్లు ఎక్కువగా ఉండటంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేత ఒక ప్రకటన చేయించాలని కమలనాధులు భావిస్తున్నారు. కానీ పవన్ కల్యాణ? మాత్రం ఆ ఎన్నికలపై పెదవి విప్పలేదు. ఎక్కాడా తమ అభ్యర్థులను బరిలోకి దించలేదు. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను చీల్చబోమని పదే పదే చెబుతున్న జనసేనాని ఈ ఎన్నికల్లో మాత్రం మిన్నకుండి పోవడం చర్చనీయాంశంగా మారింది. టీడీపీ బీజేపీని కలుపుకుని వెళ్లాలనుకుంటుంది. కానీ బీజేపీ మాత్రం జనసేనతో మాత్రమే కలసి వెళ్లాలనుకుంటుంది. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గంలో మద్దతును కోరితే ఇవ్వడానికి టీడీపీ రెడీగా ఉన్నా, కమలనాధులు ఆ పని చేయడం లేదు. జనసేనతోనే తమ ప్రయాణమని చెబుతున్నారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ పోస్టుకు మాత్రం టీడీపీ అభ్యర్థిని ఖరారు చేసింది. ఇటు అధికార పార్టీ మాత్రం ఈ ఎన్నికలకు కూడా ముందుగానే అభ్యర్థులను ప్రకటించింది. సరే.. విజయం ఎవరిదైనా విపక్షాలు మాత్రం ఈ ఎన్నికలకు ఏకం కాకపోవడం చర్చనీయాంశమైంది.

# దేశ రాజధాని ఢిల్లీలో మరో శ్రద్ధా వాకర్....

**న్యూఢిల్లీ :**

దేశ రాజధాని ఢిల్లీలో మరో దారుణం జరిగింది. గత ఏడాది ఓ యువతి శ్రద్ధా వాకర్ ను బాయ్ ఫ్రెండ్ హత్య చేసి డెడ్ బాడీని ముక్కలు ముక్కలుగా నరికి రిఫ్రిజిరేటర్ లో దాచడం దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. తాజాగా అలాంటి ఘటన నైరుతి ఢిల్లీలోని మిత్రాన్ గ్రామ శివార్లలో జరిగింది. 20 నుంచి 25 ఏళ్ల వయసున్న ఓ యువతిని సహజీవనం చేసిన యువకుడే దారుణంగా హత్య చేశాడు. అనంతరం డెడ్ బాడీని ముక్కలుగా నరికి ఫ్రిజ్ లో దాచడం కలకలం రేపింది. నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేసి విచారించగా సంచలన విషయాలు వెలుగుచూశాయి.అదనపు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ద్వారక) విక్రమ్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. సాహిల్ గెహ్లోట్, హర్యానా లోని ఝుజ్జర్ కు చెందిన నిక్కీ యాదవ్ కొన్ని నెలల నుంచి ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరూ సహజీవనం చేస్తున్నారని స్థానికులు తెలిపారు. అయితే ఈ ఫిబ్రవరి 10న సాహిల్ వివాహం జరిగింది. కానీ తన పెళ్లికి ప్రియురాలు అడ్డుగా భావించి నిందితుడు తనతో సహజీవనం చేసిన యువతిని హత్య చేయాలని భావించాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల కిందట ఢిల్లీలోని కశ్మీరీ గేట్ ఐఎస్‌బీటీ వద్ద నిక్కీ యాదవ్ ను గొంతు నులిమి ఊపిరాడకుండా చేసి హత్య చేశాడు. అనంతరం నిక్కీ యాదవ్ డెడ్ బాడీని తన కారులో నజఫ్ గఢ్ లోని మిత్రాన్ గ్రామానికి తీసుకొచ్చాడు. అనంతరం డెడ్ బాడీని ముక్కలు ముక్కలుగా నరికి తన దాబాలోని రిఫ్రిజిరేటర్ లో ఉంచాడని పోలీసులు తెలిపారు.ఫిబ్రవరి 10వ తేదీన ప్రియురాలు నిక్కీ యాదవ్ ను హత్య చేసిన రోజే మరో అమ్మాయిని వివాహం చేసుకున్నాడు సాహిల్. పోలీసులు నిందితుడు నడుపుతున్న దాబాకు వెళ్లి తనిఖీ చేయగా ఫ్రిజ్ నుంచి దుర్వాసన రావడంతో తెరిచి చూడగా ఓ డెడ్ బాడీని ముక్కలు చేసి దాచి ఉంచిటన్లు పోలీసులు గుర్తించారు. తాను వేరే అమ్మాయిని పెళ్లి చేసుకుంటున్నాడని తెలుసుకున్న నిక్కీ యాదవ్ తనను మోసం చేశావంటూ ప్రియుడ్ని నిలదీసింది. వేరే అమ్మాయితో పెళ్లిని అడ్డుకుంటానని ఆమె చెప్పడంతో ఆవేశానికి లోనై తానే నిక్కీ యాదవ్ ను హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో నిందితుడు సాహిల్ అంగీకరించాడని వార్తా సంస్థ పీటీఐ రిపోర్ట్ చేసింది. తన పెళ్లిని అడ్డుకుంటుందన్న కారణంతోనే ప్రియురాలిని హత్య చేశానని నిందితుడు అంగీకరించాడని అడిషనల్ డీసీపీ విక్రమ్ సింగ్ వెల్లడించారు. నిందితుడు సాహిల్ పై కఠిన చర్యలు తీసుకుంటామని, చట్ట ప్రకారం నడుచుకుంటామని చెప్పారు.శ్రద్ధా వాకర్ అనే 27 ఏళ్ల యువతిని ఆమెతో సహజీవనం చేస్తున్న ఆఫ్తాబ్ అమీన్ పూనావాలా అనే యువకుడు గొంతు కోసి హత్య చేశాడు. ఆపై ఆమె మృతదేహాన్ని 35 ముక్కలుగా చేసి రిఫ్రిజిరేటర్‌లో భద్రపరిచాడు. తనకు వీలు దొరికినప్పుడల్లా ఢిల్లీ చుట్టుపక్కల ప్రాంతాల్లో కొన్ని ముక్కలు పారవేశాడు. శ్రద్ధా హత్య కేసులో ఢిల్లీ పోలీసులు 6,636 పేజీల చార్జిషీట్‌ను విడుదల చేశారు. కేసు నమోదైన 75 రోజుల్లో చార్జిషీట్‌ను సమర్పించారు. గతేడాది నవంబర్ 12న ఢిల్లీ పోలీసులు నిందితుడు అఫ్తాబ్ ను అరెస్ట్ చేశారు.

# అర్ధం కానీ దళపతి వ్యూహం

**హైదరాబాద్ :**

ఈటెల రాజేందర్. గులాబీ కండువా తీసేసి.. బీజేపీలోకి వెళ్లిన తర్వాత అధికారపార్టీ నేతలు ఈటలపై అగ్గిమీద గుగ్గిలం అయ్యే వారు. ఆయన ఏమీ మాట్లాడినా కౌంటర్ వచ్చేంది. బీజేపీ ఎమ్మెల్యేగా గెల్చిన తరవాత జరిగిన అసెంబ్లీ సమావేశాలకు వచ్చిన ఈటలను సభలో ఉండనివ్వలేదు. రెండుసార్లు ఆయన్ని సస్పెండ్ చేశారు. అసెంబ్లీ బయట చేసిన కామెంట్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేసి.. ఆయన్ని సభలోకి రానివ్వలేదు. అసెంబ్లీ ఆవరణలోను నిరసన తెలిపే అవకాశం ఇవ్వలేదు. అసెంబ్లీ ప్రాంగణంలోనే అదుపులోకి తీసుకుని ఈటలను ఇంటి దగ్గర వదిలి వచ్చారు పోలీసులు. తన సొంత వాహనంలో కూర్చోవడానికి కూడా మాజీ మంత్రికి అనుమతి ఇవ్వలేదు. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ సెషన్‌లోనూ అదే పరిస్థితి.సీఎం తన ముఖాన్ని చూడొద్దనే సభలోకి రాకుండా అడ్డుకుంటున్నారని ఈటల ఆరోపించిన సందర్భాలు ఉన్నాయి. సభలో తన గొంతు నొక్కేస్తున్నారని ఆక్రోశించారు. అయితే తాజా బడ్జెట్ సమావేశాల్లో సీన్ మారింది. ఈటలను సభలో ఉండనిస్తారా లేదా అనే చర్చ జరుగుతున్న సమయంలో అనేక నాటకీయ పరిణామాలు జరిగాయి. బడ్జెట్ సమావేశాల్లో ఈటలపై ఎలాంటి చర్చ లేదు. పైగా సీఎం కేసీఆర్ తన ప్రసంగంలో పదే పదే ఈటల పేరును ప్రస్తావించారు. మంత్రులతో కలిసి ఈ మాజీ మంత్రి లంచ్ కూడా చేశారు. అంతేనా.. సీఎంతోపాటు ఇతర మంత్రులు కూడా 'మా ఈటల'అని పలకరించడం ఆశ్చర్యపరిచింది.అసెంబ్లీ లాబీలో కేటీఆర్‌తో ఈటల ముచ్చట్లపై అధికారపార్టీలో చర్చ జరుగుతున్న సమయంలో సీఎం కేసీఆర్ ప్రసంగంలో ఈటల పేరు ప్రస్తావనకు రావడంతో ఏం జరుగుతుందా అనే ఆరాలు మొదలయ్యాయి. ఇదే సమయంలో హుజూరాబాద్‌కు చెందిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డికి మండలిలో విప్ పదవి ఇచ్చారు. ఈటల సామాజికవర్గానికే చెందిన బండా ప్రకాష్‌ను శాసనమండలి డిప్యూటీ ఛైర్మన్‌ను చేశారు. ఇవన్నీ చూసినవాళ్లు.. జరుగుతున్న ఘటనలను బేరీజు వేసుకుంటున్నవాళ్ల అభిప్రాయం మరోలా ఉందట. బీజేపీలో ఒక గందరగోళ వాతావరణం ఏర్పరిచేందుకే సీఎంతోపాటు ఇతర మంత్రులు ఈటల విషయంలో ఆ కామెంట్స్ చేశారని అనుకుంటున్నారట. స్వయంగా ఈటల సైతం తనను డ్యామేజ్ చేసేందుకే తన పేరును ప్రస్తావించారని చెప్పుకొచ్చారు. తాను బీజేపీని వీడేది లేదని ఆయన స్పష్టత ఇచ్చారు. మొత్తానికి గులాబీ బాస్ ఏం చేసినా ఓ లెక్క ఉంటుందని.. ఈటల విషయంలోనూ అదే స్ట్రాటజీ అమలు చేశారని రాజకీయ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి.

# ఆన్ లైన్ వాల్యుయేషన్ కథ మళ్లీ మొదటికి

**హైదరాబాద్ :**

తెలంగాణ ఇంటర్మీడియేట్ ఆన్‌లైన్ వాల్యుయేషన్‌కి పిలిచిన టెండర్ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇంటర్మీడియట్ జవాబు పత్రాల డిజిటల్ మూల్యాంకనం (ఆన్‌లైన్) కోసం రెండోసారి టెండర్లు పిలవాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. తొలివిడతగా ఫిబ్రవరి 24న టెండర్ నోటిఫికేషన్ ఇవ్వగా.. బిడ్ల దాఖలుకు ఫిబ్రవరి 13తో గడువు ముగిసింది. వాల్యుయేషన్ చేసేందుకు ఒకే ఒక్క కంపెనీ ముందుకొచ్చింది. ఒకే బిడ్ వస్తే దాన్ని ఆమోదించడం కుదరదు. దీంతో వేరే బిడ్లు రాకపోవడంతో పిలిచిన టెండర్ రద్దు చేస్తూ ఇంటర్ బోర్డ్ నిర్ణయం తీసుకుంది. అందువల్ల ఇంటర్ మార్చి పరీక్షలతోపాటు సప్లిమెంటరీ, పునఃపరిశీలనకు కలిపి మళ్లీ టెండర్లు పిలవాలని నిర్ణయించినట్లు బోర్డు కార్యదర్శి నవీన్ మిత్తల్ తెలిపారు. గ్లోబరీనా కానీ.. పేరు మార్చుకున్న కో ఆప్ట్ ఎడ్యుటెక్ సంస్థ గానీ టెండర్లు దాఖలు చేయలేదని, దాన్నిబట్టి ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.మధుసూదన్ రెడ్డి ఆరోపణల్లో వాస్తవం లేదని తేలిందని ఆయన పేర్కొన్నారు.ఇదిఇలా ఉంటే గ్లోబరేనా సంస్థ చేసిన తప్పిదాలు వల్లే ఎంతో మంది విద్యార్థులకు మార్కులు తప్పులతడకగా పడినట్టు గతంలో ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా ఇంటర్ విద్యా మండలి ఆన్‌లైన్ వాల్యుయేషన్ కోసం జారీ చేసిన టెండర్స్‌ను రద్దు చేయడంపై తాజాగా డాక్టర్ పి మధుసూదన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఇక ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ టెండర్లకి సంబంధించి మౌలికమైన మార్పులు చేసి అనుభవం ఉన్న సంస్థలతో ఆన్‌లైన్ వాల్యుయేషన్‌ని దశలవారీగా అమలు చేయాలని ఇంటర్ విద్య జేఏసి చైర్మన్ అన్నారు. అలాగే ఆన్‌లైన్ వాల్యుయేషన్ పట్ల అధ్యాపకులకు శిక్షణ ఇచ్చి, ప్రయోగాత్మక పద్ధతిని మే నెలలో జరగబోయే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఎగ్జామ్స్ పేపర్స్ వ్యాల్యుయేషన్ నుంచి అమలు చేయాలని ఇంటర్ బోర్డుకు సూచించారు.గ్లోబరీనా సంస్థే పేరు కో ఆప్ట్ ఎడ్యుటెక్‌గా పేరు మార్చుకొని టెండర్లలో పాల్గొనబోతోందని, ఫిబ్రవరి 1న జరిగిన ప్రీ బిడ్ సమావేశానికి కూడా ఆ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారని మధుసూదన్ రెడ్డి ఫిబ్రవరి 7న ఆరోపించిన సంగతి తెలిసిందే. అదేరోజు రాత్రి స్పందించిన ఇంటర్ బోర్డు ఓ ప్రకటన జారీ చేస్తూ ఆ సంస్థ ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారని, గ్లోబరీనా లేదా కోఆప్ట్ సంస్థకు టెండర్లలో పాల్గొనే అర్హత లేదని స్పష్టం చేసింది. ఎందుకు అర్హత లేదన్నది ప్రకటించలేదు. ఒకవేళ బ్లాక్ లిస్ట్‌లో పెడితే ఆ నిర్ణయం ఎప్పుడు తీసుకున్నారో వెల్లడించలేదు. బ్లాక్ లిస్టులో పెడితే.. ఆ సంస్థ చేసిన పనిని ర్యాటిఫై చేయాలని నవంబరు 11న జరిగిన ఇంటర్ బోర్డు సమావేశంలో ఎజెండాగా ఎందుకు పెట్టారన్నది ప్రశ్న. జనవరి 30న నవీన్ మిత్తల్ నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కూడా గ్లోబరీనాను బ్లాక్ లిస్టులో పెట్టినట్లు ప్రకటించకపోవడం గమనార్హం.

# గద్వాలలో పోస్టర్ల కలకలం

**మహబూబ్ నగర్ :**

గద్వాల అసెంబ్లీ సెగ్మెంట్‌లో రాజకీయం ప్రతిరోజు హాట్‌హాట్‌గా ఉంటుంది. పలు సందర్భాల్లో అధికార విపక్షాల మధ్య మాటల తూటాలు పేలితే.. మరికొన్నిసార్లు అధికార పక్షంలోనే వర్గపోరు బట్టబయలైన ఉదంతాలు ఉన్నాయి. తాజాగా బీఆర్ఎస్‌లో ఓసీ వర్సెస్ అన్నట్టుగా రాజకీయం ఉంది. గద్వాలలో వెలిసిన పోస్టర్లు ఆ చర్చకు కారణంగా మారాయి. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డికి, జడ్పీ ఛైర్‌పర్సన్ సరితా తిరుపతయ్యలకు మొదటి నుంచి సఖ్యత లేదు. కలిసి కార్యక్రమాల్లో పాల్గొన్నా.. పైపైనే నవ్వులు. ఈ ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో గద్వాల నుంచి పోటీ చేయాలనేది జడ్పీ ఛైర్‌పర్సన్ దంపతుల ఆలోచనట. ఇది సహజంగానే ఎమ్మెల్యేకు రుచించడం లేదు. ఇద్దరూ ప్రొటోకాల్ పదవుల్లో ఉండటంతో ఎవరి ఎత్తుగడలు వాళ్లవే.ప్రస్తుతం చర్చగా మారిన పోస్టర్లు ఇవే. వీటిల్లో జడ్పీ ఛైర్‌పర్సన్ దంపతులు, శాట్స్ ఛైర్మన్ ఆంజనేయులు గౌడ్, మున్సిపల్ ఛైర్మన్ కేశవ్, జడ్పీ మాజీ ఛైర్మన్ బండారి భాస్కర్ ఫొటోలు మాత్రమే కనిపిస్తున్నాయి. మిస్ అయ్యిందల్లా ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఫొటోనే. ఇది కావాలని చేశారా లేక ఇంకేదైనా వ్యూహం ఉందా అనేది పార్టీ వర్గాలు ఆరా తీస్తున్నాయి. ఈ ఎపిసోడ్‌లో మరో ప్రత్యేకత కూడా ఉంది. పోస్టర్లలో కనిపిస్తున్న వాళ్లంతా బీసీ సామాజికవర్గాలకు చెందిన నాయకులు. ఎమ్మెల్యేపై రాజకీయ వైరం ఉండటంతో.. బీసీ కార్డును ఆయుధంగా చేసుకుని బీఆర్ఎస్‌లోని మిగతా నేతలను పోగేసినట్టుగా చర్చ సాగుతోంది. దీంతో గద్వాల అధికారపార్టీలో ఓసీ వర్సెస్ బీసీ అన్నట్టుగా నేతల వైరం శ్రుతి మించిందని అభిప్రాయ పడుతున్నారు. ప్రస్తుతం పార్టీలో ఏ ఇద్దరు కలిసినా దీనిపైనే చర్చ.పోస్టర్లపై ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అండ్ టీమ్ కారాలు మిరియాలు నూరుతోందట. తాను అన్ని కులాలను సమానంగా చూస్తుంటే.. ఈ జగడాలేంటని ఎమ్మెల్యే ప్రశ్నిస్తున్నారట. నేతల మధ్య దూరం తీసుకురావడానికి కొందరు విఫలయత్నం చేస్తున్నారనేది ఆయన ఆరోపణ. ఇతర పార్టీలతో టచ్‌లో ఉన్న బీఆర్ఎస్ నాయకులు ఎవరో తనకు, ప్రజలకు తెలుసని చురకలు వేస్తున్నారు ఎమ్మెల్యే. ఈ రగడపై జడ్పీ ఛైర్‌పర్సన్ దంపతులు కూడా స్పందించారు. ఎమ్మెల్యే ఫొటో లేకుండా పోస్టర్లు వేసింది ఎవరో తమకు తెలియదని చెబుతున్నారు. ఎమ్మెల్యే వర్గం చూపంతా సరితా తిరుపతయ్య మీదే ఉందట. మొత్తానికి ఎన్నికల వేళ గద్వాల గులాబీ తోటలో కులం కార్డుల ప్రయోగం కలకలం రేపుతోంది.

# బాలుడి మిస్సింగ్ కేస్ చేధించిన పోలీసులు

**కాకినాడ**



జగ్గంపేట మండలం రాజపూడి గ్రామంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 9వ తరగతి చదువుతున్న కుంచె దుర్గాప్రసాద్ అనే బాలుడు మంగళవారం రాత్రి హాస్టల్ లో కనిపించడం లేదంటూ హాస్టల్ వార్డెన్ వివి.కృష్ణ జగ్గంపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చారు. ఈ ఫిర్యాదు పై కాకినాడ జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు గారి ఆదేశాల మేరకు తక్షణం జగ్గంపేట సిఐ బి.సూర్య అప్పారావు పర్యవేక్షణలో జగ్గంపేట ఎస్సై సిహెచ్ విద్యాసాగర్ మిస్సింగ్ కేసుగా నమోదు చేసి, బాలుడి ఆచూకీ కనుగొనేందుకు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా జగ్గంపేట మెయిన్ రోడ్డు ఇతర ప్రాంతాలలోని సీసీ ఫుటేజ్ పరిశీలించి, టెక్నాలజీ పరిజ్ఞానంతో పరిశీలించగా బాలుడు రాజమండ్రి రోడ్ లో ఆటో ఎక్కినట్టు తెలియడంతో రాజమండ్రి పరిసర ప్రాంతాలలోని పోలీసులు జల్లెడ పట్టి,రాజమండ్రి సమీపంలోని కొన్ని ప్రాంతాలలో వెతకగా తెల్లవారుజామున 3:30 నిమిషములకు రాజమండ్రి ఆర్టీసీ కాంప్లెక్స్ లో బాలుడిని గుర్తించి జగ్గంపేట స్టేషన్ కు తీసుకువచ్చారు. సీఐ సూర్య అప్పారావు,ఎస్సై విద్యాసాగర్ లు బాలుడికి కౌన్సిలింగ్ ఇచ్చి, హాస్టల్ వార్డెన్ కృష్ణకు కుంచే దుర్గాప్రసాద్ ను అప్పగించారు. ఈ యొక్క మిస్సింగ్ కేసును ఏడు గంటల వ్యవధిలో సురక్షితంగా చేధించడంతో కాకినాడ జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు జగ్గంపేట సీఐ, ఎస్ఐ, సిబ్బందిని అభినందించారు.

# కారు, ఆటో ఢీ.. ఇద్దరు మృతి..విద్యార్థులకు గాయాలు



సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఇబ్రహీం నగర్ గ్రామ శివారులో అదుపుతప్పి కారు బోల్తా పడి ఒక్కరు మృతి చెందారు... రాజీవ్ రహదారిపై సంఘటన జరగడంతో భారీగా ట్రాఫిక్ జాం కావడంతో పెద్ద కోడూరుకు చెందిన స్కూల్ పిల్లలతో వెళ్తున్న ఆటో ఆగడం...వెనుక నుంచి వస్తున్న మరొక కారు ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న నలుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థులను హుటాహుటిన సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న మంత్రి హరీష్ రావు విద్యార్థులను పరామర్శించి ధైర్యం చెప్పారు.గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి వైద్యాధికారులను ఆదేశించారు. ఈ ఘటనపై చిన్నకోడూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# నిత్యవసర సరుకులు పంపిణీ

**కాకినాడ**



రమణయ్యపేట ఏపీఐ ఐసి కాలనీలో లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యవసర సరుకుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు టి. సి. దేవకీదేవి మాట్లాడుతూ సమాజ సేవలో ప్రధానమైనది మానవ సేవ అని ఆ దిశగా తమ క్లబ్ తరపున ప్రతినెలా దీర్ఘకాలిక రోగులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్నా మన్నారు. అదేవిధంగా మహిళల సాధికారతకు గాను కుట్టు శిక్షణా కేంద్రాలను నిరంతరం కొనసాగిస్తున్నామని అన్నారు. దీనివలన వందలాది మంది మహిళలు ఉపాధి అవకాశాలను పొందుతున్నారని అన్నారు. ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా చేసే సేవా కార్యక్రమాలకు సభ్యులంతా తమ సొంతదనాన్ని వెచ్చించి సేవలు చేస్తానన్నారు. దీంట్లో ఏ స్వలాభం ఉండదని మానవతా దృక్పథంతో మాత్రమే సేవలు చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. సునీత, వి. మీనాక్షి, మాజీ సర్పంచ్ అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

## అంధురాలు రాణిని హత్యచేసిన రాజు ను కఠినంగా శిక్షించాలి

**కడప**



ఇటీవల జరిగిన అందురాలు రాణి హత్య చేసిన రాజు పై కఠిన చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కడప అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడ తాడేపల్లి లోని అంధురాలైన రాణి అనే యువతి మీద రాజు అనే కిరాతకుడు హత్యాచారం చేసి దారుణంగా చంపబడమైనది. ఈ హత్య ను వికలాంగుల హక్కుల పోరాట సమితి ఖండిస్తూ రాజు అనే వానిని వెంటనే ఉరితీయాలని అందురాలైన రాణి కి ఆమె కుటుంబానికి 50 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మానసిక వికలాంగుల పైన మహిళల పైన దాడులు అత్యాచారం చేసి చంపడం చాలా దారుణం అన్నారు. మొన్న ఒంగోలు నిన్న కడప భాకరాపేట ఇప్పుడు సీఎం ఇంటి సమీపాన తాడేపల్లి లో రాణి అనే అందురాలైన మహిళ పైన అత్యాచారాలు హత్యలు జరిగినవి అలాగే రాష్ట్రంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుచున్నాము. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నం చిన్న సుబ్బయ్య యాదవ్, సంఘ సేవకులు సల్లావుద్దీన్, ఆర్ సి పి రవి శంకర్ రెడ్డి, ఎం ఎస్ పి నాయకులు మాతయ్య, వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు విభిన్న ప్రతిభావంతుల తెలుగుదేశం పార్టీ వికలాంగుల రాష్ట్ర అధికార ప్రతినిధి దాది శ్రీను, నగర అధ్యక్షుడు ప్రసాద్, విద్యార్థి రాష్ట్ర నాయకులు వర్ధన్, సుబ్బరాయుడు, ఎం ఆర్ పిఎస్ నాయకులు గంగులయ్య, ఎర్రగుంట్ల చంద్రశేఖర్ రెడ్డి, వికలాంగులు జిల్లా కార్యదర్శి అంజి ,బి ఓబయ్య, ఆరిపుల్ల, చెయ్య రాజు తదితరులు వికలాంగుల పాల్గొన్నారు.

## ఈనెల 18 నుండి రెండు రైళ్ల పాక్షిక రద్దు

**గుంతకల్లు**

గుంటూరు గుంతకల్లు రైల్వే డబ్లింగ్ పనుల నిమిత్తం ఈనెల 12వ తేదీ నుండి గుంటూరు కాచిగూడ గుంటూరు మరియు కర్నూలు మచిలీపట్నం కర్నూలు తదితర రైళ్ళను 28వ తేదీ వరకు పూర్తిగా రద్దు చేసిన విషయం విధితమే.దీనికి కొనసాగింపుగా మరికొన్ని రైల్లను ఈనెల 18వ తేదీ నుండి 28వ తేదీ వరకు పాక్షికంగా రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది.నంద్యాలలో మధ్యాహ్నం మూడు గంటలకు బయలుదేరు కాచిగూడ గుంటూరు ఎక్స్ప్రెస్ రైలు దొనకొండ వరకు వెళ్లి అక్కడ నుంచి మరుసటి రోజు తిరిగి కాచిగూడ కు బయలుదేరుతుంది.నంద్యాలలో రాత్రి 1.50 నిమిషాలకు బయలుదేరు తిరుపతి గుంటూరు ఎక్స్ ప్రెస్ రైలు మార్కాపురం వరకు మాత్రమే వెళ్లి మరుసటి రోజు అక్కడి నుండి తిరుపతికి తిరిగి బయలుదేరుతుంది. ఈ రైలు నంద్యాల నుండి తిరుపతికి వెళ్ళు వేళలలో ఎటువంటి మార్పులు లేవు.

## డ్రాప్ ప్లాస్టిక్స్ ప్రాజెక్టు ప్రారంభం

**విశాఖపట్నం**

విశాఖలో ఇండియా పొల్యూషన్ కంట్రోల్ అసోసియేషన్,కియా మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా డ్రాప్ ప్లాస్టిక్ ప్రాజెక్టు ప్రారంభించింది.లాసన్స్ బే పార్క్ లో నిర్వహించిన కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పబ్లిక్ హెల్త్ సన్యాసిరావు,కియా మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.నగరంలో ప్లాస్టిక్ 120 మైక్రోన్ తక్కువ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించడం జరిగిందని వారు చెప్పారు.ముఖ్యంగా ఈ కార్యక్రమంలో పాల్గోన్న విద్యార్ధులకు ప్లాస్టిక్ నిషేదంపై ఉన్న ప్రాధాన్యతను వివరించారు.

## కొడుకును సీఎం చేసేందుకే బీఆర్ఎస్ పార్టీ- వివేక్ వెంకటస్వామి

**మంచిర్యాల**

కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకే కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీ పెట్టిండని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలో పర్యటించిన ఆయన.. ముఖ్యమంత్రి వైఖరిపై ఫైర్ అయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో సీఎం కేసీఆర్ మెఘా కృష్ణారెడ్డిని ప్రపంచంలోనే ధనవంతున్ని చేసి రైతులను పేదోళ్లను చేశాడని వివేక్ మండిపడ్డారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబానికి తప్ప నిరుద్యోగులకు ఉద్యోగాలు రాలేదని విమర్శించారు. ఆస్తులను పెంచుకునేందుకు తప్ప ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం పని చేయడం లేదని అన్నారు.పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టించకుండా తన కోసం 100 పడకల ప్రగతి భవన్, కొడుకు, కూతురు, అల్లుడికి ఫాంహౌస్ కట్టించుకున్నాడని వివేక్ వెంకటస్వామి ఆరోపించారు. తన తండ్రి గడ్డం వెంకటస్వామి ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు తెస్తే దాన్ని పక్కనబెట్టి కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు రీ డిజైనింగ్ చేసి ఆ నీటిని ఫాం హౌస్ కు తరలించుకుంటున్నాడని మండిపడ్డారు. మిషన్ భగీరథ పథకంలో సీఎం భారీ అవినీతికి పాల్పడ్డారన్న ఆయన.. తెలంగాణ ప్రజల సొమ్మును ఇతర రాష్ట్రాల్లో ఖర్చుపెడుతూ కేసీఆర్ తన కొడుకును సీఎం చేయాలని చూస్తుందని విమర్శించారు.

# కోమటిరెడ్డిపై చర్యలు తప్పవా...

**హైదరాబాద్ :**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి. బీఆర్ఎస్‌తో పొత్తు ఖాయమన్నట్లుగా ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీకి ఇబ్బందికరంగా ఉన్నాయని.. పార్టీకి చెడు చేసే ఉద్దేశంతోనే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారన్న విమర్శలు ఆ పార్టీలో వినిపిస్తున్నారు. అసంతృప్త సీనియర్లు కూడా ఆయనకు వ్యతిరేకంగానే వ్యాఖ్యలు చేస్తున్నారు. బీఆర్ఎస్ తో కలవాల్సిన పరిస్థితి రాదని.. కోమటిరెడ్డివి వ్యక్తిగత వ్యాఖ్యలన్న వాదన వినిపిస్తున్నారు. శ్రీధర్ బాబు, జగ్గారెడ్డి నేరుగానే తమ అభిప్రాయం చెప్పారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలు వ్యక్తిగతమని పట్టించుకోవాల్సిన అవసరం లేదని శ్రీధర్ బాబు చెబుతున్నారు. జగ్గారెడ్డి మాత్రం కాంగ్రెస్‌తో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకునే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఈ సారి కోమటిరెడ్డి వ్యవహారాన్ని హైకమాండ్ సీరియస్‌గా తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మాణిక్ రావు థాక్రే... కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలను పరిశీలించారు. వీడియో చూసి ఆయన ఓ అభిప్రాయానికి వచ్చారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. బుధవారం ఉదయం తనను కలవాలని కోమటిరెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి వస్తారో లేదో కానీ.. ఈ విషయంపై కాంగ్రెస్ హైకమాండ్‌కు కూడా చాలా ఫిర్యాదులు వెళ్లాయి. కోమటిరెడ్డి వెంకటరెడ్డి పూర్తి స్థాయిలో కోవర్టుగా పని చేస్తున్నారని ఆయనను నమ్మడం వల్ల పార్టీ మునుగడమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని చెబుతున్నారు. కొంత మంది నేతలు బహిరంగంగానే కోమటిరెడ్డిపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఇటీవల మునుగోడు ఉపఎన్నికల సందర్భంగా కూడా కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. తెలంగాణలో రాహుల్ గాంధీ పాదయాత్ర జరిగినా ఆయన పాల్గొనలేదు. మునుగోడు ఉపఎన్నికల సమయంలో ఆస్ట్రేలియా వెళ్లిన ఆయన అక్కడ కాంగ్రెస్ పార్టీ గెలవదని ప్రకటించారు. ఆ వీడియో వైరల్ అయింది. దీంతో ఆయనకు రెండు సార్లు కాంగ్రెస్ హైకమాండ్ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే అది తన వీడియో కాదని మార్ఫింగ్ చేశారని కోమటిరెడ్డి షోకాజ్ నోటీసులకు సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ హైకమాండ్ ఆ సమాధానంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కొత్త ఇంచార్జ్ గా మాణిక్ రావ్ థాక్రే వచ్చిన తర్వాత గాంధీ భవన్‌కు కూడా వచ్చారు. రేవంత్ తో కూడా సమావేశంయ్యారు. దీంతో సమస్య పరిష్కారం అయిందని..ఇక కోమిటిరెడ్డి సర్దుకుపోతారని అనుకున్నారు. కానీ కాంగ్రెస్ హైకమాండ్ పిలుపునిచ్చిన హాత్ సే హాత్ జోడోయాత్రను కోమటిరెడ్డి ప్రారంభించలేదు. హఠాత్తుగా ఆయన ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి కాంగ్రెస్ పార్టీ సొంతంగా గెలవలేదని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కోమటిరెడ్డి సోదరుడు రాజగోపాల్ రెడ్డి ఇప్పటికే బీజేపీలో ఉన్నారు. తరచూ బీజేపీ అగ్రనేతల్ని కోమటిరెడ్డి కలుస్తున్నారు. వివాదాస్పద కామెంట్లు చేస్తున్నారు. . ఇదంతా కావాలనే చేస్తున్నారని.. పార్టీలో ఉంటూ.. పార్టీని డ్యామేజ్ చేస్తున్నారని ఇతర కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. కోమటిరెడ్డిపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ ఆ పార్టీలో ఎక్కువగా వినిపిస్తోంది.

# మారనున్న బాసర రూపు రేఖలు

**అదిలాబాద్:**

దక్షిణ భారతదేశంలో సుప్రసిద్ధ చదువుల క్షేత్రం బాసర ఆలయం సరికొత్త రూపును సంతరించుకోనుంది. ఆలయాన్ని కొత్తగా నిర్మించేందుకు తెలంగాణ దేవాదాయశాఖ ప్లాన్ రెడీ చేస్తోంది. కర్ణాటకలోని శృంగేరి పీఠం నుంచి అనుమతి తీసుకొని ఆగమశాస్త్రం ప్రకారం మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అధికారులు భావిస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణానికి కేసీఆర్ సర్కారు రూ. 50 కోట్ల నిధులు మంజూరు చేయగా.. అందులో రూ. 8 కోట్ల వ్యయంతో ఇప్పటికే ఆలయ పరిసరాల్లోని విశ్రాంతి భవనాలు, తదితర పనులను చేపట్టింది. రూ. 22 కోట్లతో ఇప్పుడున్న గర్భాలయాన్ని కృష్ణశిలలతో అత్యద్భుతంగా నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.బాసరలో మహా సరస్వతి, మహాలక్ష్మి, మహంకాళి అమ్మవార్లు కొలువై ఉన్నారు. గర్భగుడిలో మహా సరస్వతి విగ్రహానికి కుడివైపున మహాలక్ష్మి అమ్మవారి విగ్రహం ఉండగా..పైఅంతస్తులో మహంకాళి విగ్రహం ఉంది. సరస్వతి అమ్మవారి దర్శనం అనంతరం పక్కనే ఉన్న మహాలక్ష్మి అమ్మవారి ప్రతిమ కనిపించేలా ఉండాలని ఆగమ శాస్త్రం చెబుతోంది. అయితే ఇప్పుడు భక్తులు ప్రత్యేకంగా చూస్తే తప్ప మహాలక్ష్మి అమ్మవారి విగ్రహం కనిపించటం లేదు. అందువల్ల ఇప్పుడున్న ప్రాకార మండపాన్ని తొలగించి కొత్త మండపాన్ని నిర్మించేందుకు ప్లాన్ సిద్ధం చేస్తున్నారు.ప్రాకార మండపానికి తూర్పు, పశ్చిమ దిశల్లో ఏడంతస్తులతో రెండు రాజ గోపురాలు, ఉత్తర, దక్షిణ దిశల్లో అయిదు అందస్తులతో మరో రెండు రాజ గోపురాలు నిర్మించేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పుడున్న ప్రాకార మండపం మరో 50 మీటర్లు ముందుకు జరుగనుంది. ప్రస్తుతం 10 అడుగుల పొడవు 10 అడుగుల వెడల్పుతో ఉన్న గర్భగుడి 25.5 అడుగుల వెడల్పు, 16.5 అడుగుల పొడవుతో పునర్నిర్మించనున్నారు. 6.5 అడుగుల వెడల్పున్న ఆలయ ముఖ ద్వారాన్ని 18.5 అడుగులకు పెంచాలని దేవాదాయ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.ఆలయ నూతన ప్రణాళికను వరంగల్ ఎన్ఐటీ నిపుణులతో తయారుచేయించామని ఆలయ ఈవో విజయరామారావు స్పష్టం చేశారు. ఈ నెలలో శృంగేరి పీఠాధిపతుల అనుమతి తీసుకొని ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ప్రస్తుతానికి గర్భగుడిని కృష్ణశిలతో నిర్మించాలని నిర్ణయించామని చెప్పారు. గోదావరి ఘాట్ల వద్ద సుందరీకరణ, క్యూ కాంప్లెక్సుల్లో నీటి వసతి, సాధారణ భక్తుల వసతి కోసం మరిన్ని గదుల నిర్మాణం చేపడతామన్నారు.తెలంగాణలోని ప్రముఖ దేవాలయాల అభివృద్ధిపై కేసీఆర్ సర్కార్ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇప్పటికే యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని పునర్నిర్మించింది. ఆగమశాస్త్రం ప్రకారం ఆలయం మె?త్తం కృష్ణశిలతో అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. రాజగోపురాలు, ప్రాకారాలు, ఆలయ మాడవీధులు, కాటేజీలు, ఉద్యాన వనాలతో ఆలయ రూపురేఖలను మార్చేశారు. కొండగట్టు, వేములవాడ ఆలయాలకు కూడా తెలంగాణ ప్రభుత్వం నిధులు కేటాయించింది.కొండగట్టు ఆలయ అభివృద్ధికి రూ. 100 కోట్లు ప్రకటించిన కేసీఆర్..ఆలయాన్ని సందర్శించారు. యాదాద్రిని పునర్నిర్మించిన ప్రముఖ ఆర్కిటెక్ట్ ఆనంద్ సాయి నేతృత్వంలోనే కొండగట్టు ఆలయాన్ని అభివృద్ధి చేయాలని దేవాదాయశాఖ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే అభివృద్ధి పనులకు సంబంధించిన మాస్టర్ ప్లాన్, నివేదికను ఆనంద్ సాయి సీఎం కేసీఆర్‌కు సమర్పించారు. ఈ ఆలయాల తరహాలోనే బాసర ఆలయాన్ని పునర్నిర్మించాలని సీఎం కేసీఆర్ యోచిస్తున్నారు.

# జిల్లా స్థాయి చదరంగం పోటీలు ప్రారంభం

**నంద్యాల**

ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఆల్ కర్నూల్ చెస్ అసోసియేషన్ నిర్వహణలో నంద్యాల జిల్లా స్థాయి 19 సంవత్సరాలలోపు బాల బాలికలకు చదరంగం పోటీలు బుధవారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో ప్రారంభించారు.

ఆల్ కర్నూల్ చెస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, రామకృష్ణ కళాశాలల మేనేజర్ ప్రగతి రెడ్డి అతిధులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చదరంగం పోటీలు తరచు నంద్యాలలో జరగడం ద్వారా నంద్యాల క్రీడాకారులు జిల్లా, రాష్ట్రస్థాయిలలో విజయాల సాధించడానికి దోహదపడుతున్నదని, అందుకు కృషి చేస్తున్న నిర్వాహకులు రామసుబ్బారెడ్డి తదితరులను అభినందించారు.

డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ గతంలో



కర్నూలు, నంద్యాల రెండు జిల్లాలకు కలిపి పోటీలు నిర్వహించే వారమని , ఇప్పుడు మొట్టమొదటిసారిగా ప్రత్యేకంగా నంద్యాల జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నామని,ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి అవకాశం ఏర్పడుతుందని అన్నారు.

ఆంధ్ర చెస్ అసోసియేషన్ చెస్ క్రీడాకారిణి విశాఖపట్నంకు చెందిన మీనాక్షి రాష్ట్రపతి జాతీయ అవార్డు అందుకున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కోటి రూపాయలు తన క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవడానికి శిక్షణ కోసం అందజేశారని, చదరంగంలో ఉన్నత స్థాయి విజయాలు సాధించిన వారికి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించడం ప్రశంసనీయమన్నారు.

ప్రగతి రెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు చదరంగం ఆడడం ద్వారా గెలుపు ఓటములు స్వీకరించే మానసిక స్థైర్యం ఏర్పడుతుందని, ఓటమి తర్వాత విజయాలు సాధించడానికి ముమ్మరంగా సాధన చేయాలన్న పట్టుదల ఏర్పడుతుందని, అదే మానసిక ధైర్యం చదువులో కూడా చూపించడానికి తద్వారా విద్యలో కూడా ఉన్నత స్థాయిలో రాణించటానికి అవకాశం ఏర్పడుతుందని అన్నారు.

డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవి కృష్ణ ,ప్రగతి రెడ్డి చదరంగం లో పావులు కదిపి పోటీలు ప్రారంభించారు.

ఈ పోటీలలో వంద మందికి పైగా బాల బాలికలు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర చెస్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి, జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, లయన్స్ క్లబ్ కోశాధికారి రత్నకుమార్, టోర్నమెంట్ ఆర్బిటర్లు ఇమామ్, సుజాత, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు

## విశాఖను రాజధానిగా ఎవరూ కోరుకోవడం లేదు

**తెనాలి**

విశాఖలో రాజధాని ఏర్పాటు చేయాలని ఎవ్వరూ కోరుకోవడం లేదని.. ముఖ్యమంత్రికి దమ్ముంటే రాజధాని అంశం మీద ఎన్నికలకు వెళ్దాం రమ్మని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ సవాలు విసిరారు. నిజాయతీ, చిత్తశుద్ధి ఉంటే ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేశారు. విశాఖలో రాజధాని పెట్టి.. కార్యాలయాలు ఏర్పాటు చేస్తే తమ జీవితాలు మారిపోతాయని ఉత్తరాంధ్ర ప్రజలు భావించడం లేదన్నారు. రాజధాని అంశంలో మంత్రుల్లోనే సఖ్యత లేదని తెలిపారు. తెనాలి పర్యటనలో భాగంగా మంగళవారం 11వ వార్డు రామలింగేశ్వరపేట, మారీచుపేటల్లో ఏర్పాటు చేసిన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలువురు కార్యకర్తలకు స్వయంగా పార్టీ క్రియాశీలక సభ్యత్వం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడుతూ"రోడ్డు కూడా వేయలేని ముఖ్యమంత్రి రాజధానుల గురించి మాట్లాడుతున్నారు. ఉన్న రాజధానిని ఉద్ధరించలేకపోయారు. రైతుల త్యాగాలను పక్కనపెట్టి ఈ ప్రాంతంలో అభివృద్ధి లేకుండా చేశారు. ఒక తరానికి భవిష్యత్తు లేకుండా చేసిన ఘనత ఈ ముఖ్యమంత్రిది. ఉత్తరాంధ్ర వాసులు కూడా విశాఖ రాజధాని కావాలని కోరుకోవడం లేదు. పెట్టుబడులు తీసుకువచ్చి నిజాయితీగా ఉపాధి అవకాశాలు కల్పించాలిగాని రోజుకో ప్రకటన చేస్తే పెట్టుబడిదారులు ఎలా ముందుకు వస్తారని అన్నారు.

## కర్నూలు జిల్లాకు ద్రోహం చేసిన వైసిపి

**కర్నూలు**

విశాఖ ఒకటే రాజధాని కర్నూల్ లో హైకోర్టు కాదు బెంచ్ మాత్రమే అని ఆర్థిక మంత్రి ప్రకటించడం కర్నూలు జిల్లా ప్రజలకు ద్రోహం చేయడమేనని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక మంత్రి బుగ్గన గారు తన ప్రకటనను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇన్నాళ్లు పాలన వికేంద్రీకరణ పేరుతో మూడు రాజధానుల పాట పాడుతున్న వైసీపీ ప్రభుత్వం అసలు రంగు బయటపడిందని ఆయన విమర్శించారు. రాయలసీమ మహా గర్జన పేరుతో సభలు పెట్టి ప్రజలను మోసం చేసిన నాయకులు ఈరోజు ఎక్కడికి వెళ్లారు, ఈ ప్రభుత్వం ప్రకటించిన ప్రకటన చూసిన మేల్కొనండి అని ఆయన హితవు పలికారు. మూడు రాజధానులు అంటూ ఏమీ లేవని రాష్ట్రానికి విశాఖ ఒక్కటే ఏకైక రాజధాని అని బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పడం దారుణమని ఆయన తెలిపారు కర్నూల్ కు న్యాయ రాజధాని అని సంకలు గుద్దుకుని చెప్పిన వైసీపీ ఎమ్మెల్యేలు మంత్రి ప్రకటనపై ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని లేకపోతే తమ ఎమ్మెల్యేల పదవీలకు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలో ధార్వాడ్లో ఒక బెంచ్ గుల్బర్గాలో మరో పెంచుకున్నట్లు కర్నూల్ లో ఒక బెంచ్ మాత్రం ఏర్పాటు చేస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. కర్నూలు జిల్లా ప్రజలు వైసిపి ప్రభుత్వం యొక్క అసలు రంగు బయటపడిన తర్వాత అయినా మేల్కొనాలని ఆయన తెలిపారు. అప్పర్ భద్ర ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించినప్పుడు కూడా మాట్లాడకుండా మౌనంగా ఉండి వైసిపి నాయకులు కర్నూలు జిల్లాకు ద్రోహం చేశారని, మళ్లీ కర్నూల్ లో హైకోర్టు కాదు బెంచ్ అని మరొకసారి ద్రోహం చేస్తున్నారని ఆయన విమర్శించారు. కర్నూలు జిల్లా ప్రజల ఓట్లు వేయించుకోవడం తప్ప ఈ జిల్లా ప్రజలకు ఏమి చేయకుండా ఉండాలనే ధ్రుడమైన నిశ్చయంతో వైసిపి ప్రభుత్వం ఉందని చాలా స్పష్టంగా అర్థం అవుతుందని ఆయన ఘాటుగా విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలు వైసిపి ప్రభుత్వ అసలు రంగును గుర్తించి న్యాయ రాజధాని కోసం, అప్పర్ భద్ర ప్రాజెక్టు నిర్మాణం ఆపడం కోసం ఉద్యమాలకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## డిప్యూటీ సిఎం చేతులు మీదుగా 2023 డైరీ ఆవిష్కరణ

**కడప**



నగరం లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం అంజాద్ భాషా చేతుల మీదుగా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం అమరావతీ ఆంధ్ర ప్రదేశ్ 2023 వ సంవత్సరం డైరీ నీ మంత్రి కార్యాలయం లో బుధవారం అవిస్కరించారు .ఈ కార్యక్రమం లో మంత్రి అంజాద్ భాషా మాట్లాడుతూ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం,వాటి పరిష్కారం కోసం ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సంఘం బాగా కృషి చేయాలని సూచించారు, ఈ కార్యక్రమం లో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ చైర్మన్, పులి సునీల్ కుమార్, రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు దళిత రత్న,దేవరపల్లి జ్ఞాన ప్రకాష్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి దివాకర్ బాబు, ఎంప్లాయిస్ వింగ్ రాష్ట్ర అధ్యక్షులు పాలెం సుధాకర్ బాబు,కడప జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం స్వరూప్,జిల్లా యూత్ ప్రసిడెంట్ అభిషేక్ కొమ్మలపాటి,మరియు కడప జిల్లా జై భీమ్ మాల మహసేన అధ్యక్షులు, పల్లెకొండు సంపత్,ప్రధాన కార్యదర్శి చైతల్యా,మెంబర్ శాంసన్ తది తరులు పాల్గొన్నారు

ప్రజా తపన
prajathapana.com
News that matters

# వరంగల్ అప్లికేషన్ తో ట్రాక్టర్ డ్రైవింగ్

**వరంగల్ :**

అత్యధునిక పరికరాలు, సాంకేతిక వ్యవసాయ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లున్నాయి. రైతులకు సాంకేతికను మరింత చేరువ చేసే దిశగా పరిశోధనలు చేస్తున్నారు వరంగల్ కిట్స్ బృందం. డ్రైవర్ అవసరంలేకుండా ట్రాక్టర్ పనిచేసే విధంగా ప్రయోగాలు చేస్తున్నారు. రైతులు ఎక్కడైనా కూర్చొని పొలంలో ట్రాక్టర్‌ను మొబైల్ సాయంతో నడపవచ్చు. డ్రైవర్ అవసరం లేకుండా గేర్లు మార్చవచ్చు. ఎక్స్‌లేటర్ కూడా ఇవ్వొచ్చు. స్టీరింగ్ దానంతట అదే తిరుగుతుంది. ట్రాక్టర్ వెనక్కి, ముందుకు ఎటు కావాలంటే అటు నడిపేయవచ్చు. ఈమేరకు వ్యవసాయంలో అన్నదాతకు ప్రయోజనకరంగా.. వరంగల్ 'కిట్స్' కళాశాల అధ్యాపకులు డ్రైవర్ లేకుండా ట్రాక్టర్ నడిపే పరిజ్ఞానాన్ని ఆవిష్కరించారు. 'డ్రైవర్ రహిత ట్రాక్టర్'గా దీనికి నామకరణం చేశారు. మూడేళ్లపాటు శ్రమించి దీన్ని విజయవంతంగా అభివృద్ధి చేశారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక విభాగం (డీఎస్టీ) కింద 2020 ఫిబ్రవరిలో రూ.41 లక్షల విలువైన ఈ ప్రాజెక్టు మంజూరైంది. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ నిరంజన్‌రెడ్డి కో–ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా, సహాయ ఆచార్యుడు షర్ఫుద్దీన్ వసీమ్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా, అధ్యాపకుడు నరసింహారెడ్డి ప్రాజెక్టుకు మెంటర్‌గా వ్యవహరించగా, బీటెక్ సీఎస్‌ఈ చివరి సంవత్సరం విద్యార్థి సాకేత్ ఈ ప్రాజెక్టులో పాలుపంచుకున్నాడు. ట్రాక్టర్‌కు మైక్రో కంట్రోలర్‌ను అమర్చి, డ్రైవర్ అవసరం లేకుండానే క్లచ్, బ్రేకు, ఎక్స్‌లేటర్ తిరగడానికి మూడు యాక్చువేటర్స్ వినియోగించారు. స్టీరింగ్ తిరిగేందుకు మరో మోటార్‌ను అమర్చారు. డ్రైవర్ రహిత ట్రాక్టర్‌ను మొబైల్ ద్వారా నియంత్రించేలా రూపొందించామని ప్రిన్సిపల్ కె.అశోక్‌రెడ్డి తెలిపారు. ఐవోటీ పరిజ్ఞానంతో మెసేజ్ క్లౌడ్‌కు వెళుతుందని, అక్కడి నుంచి మొబైల్‌కు మనమిచ్చే ఆదేశాలు వస్తాయని వివరించారు. మన ఇంట్లో లేదా వేరే ఎక్కడి నుంచైనా పొలంలో ట్రాక్టర్‌ను మొబైల్ ఫోన్‌తో నడిపించవచ్చని, 45 హెచ్‌పీ ట్రాక్టర్‌పై ప్రాంగణంలో ప్రయోగాలు చేసి తెలిపారు. ట్రాక్టర్ ఉన్న రైతులు ఈ సాంకేతికతను అమర్చుకోవాలంటే రూ.20 వేలు ఖర్చవుతుందని చెప్పారు. కిట్స్ కళాశాల యాజమాన్యం, మాజీ ఎంపీ వి. లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు రూ.40 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ వర్క్ ను మొబైల్ అప్లికేషన్ ను ఉపయోగించి స్మార్ట్ వ్యవసాయం కోసం స్మార్ట్ సాధనాలను రూపొందిస్తున్నామన్నారు. ఈ మేరకు కిట్స్ వరంగల్ ప్రిన్సిపాల్ కె.అశోక రెడ్డి మాట్లాడుతూ కిట్స్ వరంగల్‌లో అత్యాధునిక సాంకేతికతో ప్రాజెక్ట రూపొందించామన్నారు. వినూత్న రీతిలో డ్రైవర్ లెస్ ట్రాక్టర్ ను కిట్స్ వరంగల్ నిపుణులు అభివృద్ధి చేశారని చెప్పారు. వ్యవసాయం భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిందన్నారు. తక్కువ ఖర్చుతో ఆటోమేషన్ సాధనాలను ప్రోత్సహించడంతో రైతులు మరింతగా భూమిని సాగుచేయడం, పెట్టుబడి ఖర్చును తగ్గించుకోవడం, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసుకోవడానికి సహాయపడుతుందన్నారు. ఈ ప్రాజెక్ట్ రైతుల కోసం తక్కువ–ధర ఆటోమేటెడ్ సాధనాలను రూపొందించడానికి ఉద్దేశించిందని చెప్పారు. సాంకేతిక అంశాల అభివృద్ధిలో పాశ్చాత్య దేశాలతో పోల్చినప్పుడు భారతీయ రైతులు ఉపయోగించే సాధనాలు తక్కువగా ఉన్నాయని ప్రిన్సిపాల్ అశోక్ రెడ్డి తెలిపారు. దేశంలో వరి, గోధుమలు, పండించడానికి అధునాతన సాధనాలు ఉన్నాయని, కానీ వ్యవసాయ పరికరాలను ఆపరేట్ చేయడానికి మానవప్రమేయం అవసరమన్నారు. అంతేకాకుండా మరింత నైపుణ్యం కలిగిన కార్మికులు అవసమన్నారు. ఈ విషయాల్ని దృష్టిలో పెట్టుకొని ఈ ప్రాజెక్ట్‌లో వ్యవసాయంలో మానవ శ్రామిక పనిని తగ్గించాలని ఆలోచించి ఈ వినూత్న రీతిలోప్రాజెక్ట్ చేపట్టామన్నారు. ఇక్కడ రైతులు తమ చిన్న తరహా పొలాలను ఆటోమేటెడ్ టూల్స్‌తో దున్నవచ్చని తెలిపారు. ప్రాజెక్ట్‌లో డ్రైవింగ్ ఇంజిన్‌ను ఉపయోగించి దున్నుతున్న యంత్రం ఆటోమేట్ చేశారని, దీనిని మొబైల్ అప్లికేషన్ (ఒక గేమ్ లాగా) ద్వారా నడుపవచ్చని చెప్పారు

# ఎన్ఎస్సార్ ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి ఎర్రబెల్లి

**వరంగల్**

వరంగల్ ఆరేపల్లి లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్ఎస్సార్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు చల్లా ధర్మా రెడ్డి, అరూరి రమేశ్, మేయర్ గుండు సుధారాణి, ఉమ్మడి వరంగల్ జిల్లా ౹జెడ్‌పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మా రావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మాట్లాడుతూ సీఎం కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో విద్యా, వైద్యానికి పెద్ద పీట వేస్తున్నారు. వైద్య విద్య, వైద్యం పై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నారు. హైదారాబాద్ నగరం కు నాలుగు దిక్కులా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లు ఏర్పాటు అవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా వైద్య, ఆరోగ్య శాఖకు భారీ బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. వరంగల్ లో ఐటీ, టెక్స్టైల్స్ పర్కులు ఏర్పాటు అవుతున్నాయి. పారిశ్రామికంగా బాగా అభివృద్ధి జరుగుతున్నది. వరంగల్ ను హెల్త్ సిటీ గా అభివృద్ధి చేస్తున్నారు. 11 వందల కోట్లతో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం అవుతున్నది. ఇప్పటికే ఎంజీఎం హాస్పిటల్ ను అన్ని విధాలుగా అభివృద్ధి పరచిన ఘనత సీఎం కెసిఆర్ ప్రభుత్వానికే దక్కుతుంది. ఎస్ఎస్ఐ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కూడా ఏర్పాటు అయ్యింది. అత్యాధునిక వైద్య సదుపాయాలు వరంగల్ లో ఉన్నాయి. ప్రభుత్వ వైద్యం పై ప్రజలకు నమ్మకం పెరిగింది. అయినా, పెరుగుతున్న జనాభా, వైద్య సంస్థల దృష్ట్యా ప్రైవేట్ వైద్యం కూడా బాగానే నడుస్తున్నది. ప్రైవేట్ వైద్యం కు కూడా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తున్నదని అన్నారు.

ప్రైవేట్ వైద్యులు,యాజమాన్యాలు వైద్యాన్ని కేవలం వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా తత్పరత తో చూడాలి. పేదలు సైతం ఖర్చు పెట్టగలిగే వైద్యాన్ని అందించాలి. పేదలకు కొంత మేర ఉచిత వైద్యం అందించాలి. వరంగల్ లో ఇప్పటికే అనేక హాస్పిటల్స్ ఏర్పడ్డాయి. అవన్నీ బాగానే నడుస్తున్నాయి.

ఎన్ఎస్సార్ హాస్పిటల్ కూడా బాగా నడవాలని కోరుకుంటున్నాను. ఎన్ఎస్సార్ హాస్పిటల్ వాళ్ళు అపోలో హాస్పిటల్ తో టై అప్ అయ్యారని చెబుతున్నారు కాబట్టి, మంచి వైద్యం అందే అవకాశాలు ఉన్నాయని అన్నారు.

# ప్రభుత్వానికి మంచి పేరు రావడంలో ఎంపీఓ ల కృషి ఎంతో ఉంది

**హనుమకొండ :**

తెలంగాణ ఉద్యమం తో పాటు రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రభుత్వానికి మంచి పేరు తేవడంలో ఎంపీఓ ల పాత్ర, కృషి ఎంతో ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఇవ్వాళ మన గ్రామాలు దేశంలోనే అగ్రగామిగా నిలిచి, అనేక అవార్డులు రావడంలోనూ ఎంపీఓ ల కృషి ని మరువలేను అన్నారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖ కు మంచి పేరు తెచ్చపెట్టారని అభినందించారు. గ్రామాలను అభివృద్ధి పరచడంలో, పరిశుభ్రంగా ఉంచడంలో, ఉపాధి హామీ పనుల్లో, అనేక విధాలుగా వాళ్ళు పని చేస్తున్నారని, ప్రభుత్వానికి మంచి పేరు తెస్తున్నారని మంత్రి చెప్పారు. ఎంపీ ఓ ల సమస్యలు ఏమైనా ఉంటే, వాటిని సీఎం దృష్టికి తీసుకెళ్లి, పరిశీలిస్తామని మంత్రి చెప్పారు. వరంగల్ హనుమకొండ మంత్రి గారి క్యాంప్ కార్యాలయంలో ఎంపీ ఓ ల సంఘం క్యాలెండర్, డైరీ ని మంత్రి ఎర్రబెల్లి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడతూ వారిని, సంఘాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ ల సంఘం నాయకులు శేషు తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నకు రెండు లక్షల రుణ మాఫీ చేస్తాం

**-500 కే గ్యాస్ సిలిండర్ అందజేస్తాం**

**-తెలంగాణలో బిజెపి గెలిచేది లేదు**

**-వరంగల్ డిక్లరేషన్ అమలు చేస్తాం**

**-శ్రీరామునికి మాట ఇచ్చి మోసం చేసినోడు బాగుపడతాడా ?**

**-భద్రాచలం జనసభలో టి పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి**

**భద్రాద్రి కొత్తగూడెం:**

దక్షిణ అయోధ్యగా బాసిల్లిన భద్రాచలం ప్రాంతం బి ఆర్ఎస్ పార్టీ పాలన వలన నష్టపోయిందని టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర భద్రాచలం కు చేరుకుంది. ముందుగా అంబేద్కర్ సెంటర్లో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభలో మాట్లాడారు. దేశ సమగ్రతను కాపాడేందుకు రాహుల్ గాంధీ భారత్ జోడో పాదయాత్ర చేపట్టేరని ఆయన తెలిపారు. గోదావరి వరద ముప్పు బాధితులను ఆదుకుంటానని పదివేల ఇస్తానని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ అమలు కాలేదని విమర్శించారు. శ్రీరాముడికి కనీసం తలంబ్రాలు ఇచ్చేందుకు కూడా కెసిఆర్ రాలేదని ఆరోపించారు. దేశంలో విభజించు పాలించు అనే విధానము బిజెపి పాలన కొనసాగుతుందన్నారు. శ్రీరాముడికి మాట ఇచ్చి మోసం చేసినోడు బాగుపడతాడా భద్రాచలం జన సభలో రేవంత్ రెడ్డి ప్రశ్నించాడు. కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యేకనే ఏడు మండలాలను ఆంధ్రలో వీలినం చేశారని ఉన్నారు. భద్రాచలాన్ని కుట్టపూరితంగా మూడుముక్కలు చేశారని ఆరోపించారు. పినపాక నియోజకవర్గం లో రైతుల కష్టాలను చూసి చలించిపోయానన్నారు. సీతారామ ప్రాజెక్టు కోసం తీసుకున్న భూములకు ఇప్పటివరకు నష్టపరిహారం రైతులకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియదని రైతులు చెప్తున్నారని అని వాపోయారు. ట్రాన్స్ఫార్మర్లు కాలిపోతున్నాయని ఇబ్బంది పడుతున్నామని రైతులు తెలియజేశారు. నిత్యవసర ధరలు పెరగడంతో రోజు కూలికి నూనె ప్యాకెట్ కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రౌండ్లో కాంగ్రెస్ లేదని బిజెపి వాళ్లు పిచ్చి కూతల కోస్తున్నారని భద్రాచలం వచ్చి చూడండి అని అన్నారు. తెలంగాణలో బిజెపి గెలిచేది లేదని తెలిపారు. ఇల్లు లేని ప్రతి పేదవాడికి 5 లక్షల ఆర్థిక సహాయం చేస్తామని అన్నారు. కౌలు రైతులకు 15000 ఆర్థిక సాయం అందజేస్తామని, వరంగల్ డిక్లరేషన్ ప్రకారనీ రెండు లక్షల రూపాయలు రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. పోడు భూములకు పట్టాలిచ్చే బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుందని తెలిపారు. శ్రీరాముడుకి 100 కోట్లు ఇచ్చి అభివృద్ధి చేస్తానని చెప్పిన సీఎం హామీ ఏమైందని సభలో ప్రశ్నించారు. ఈ కార్యక్రమములో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, మాజీ టీపీసీసీ అధ్యక్షులు హనుమంతరావు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ మంత్రి బలం బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే పోదెం వీరయ్య ప్రసంగించారు. ములుగు ఎమ్మెల్యే సీతక్క, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, కొత్తగూడెం కాంగ్రెస్ నాయకులు ఎడవెల్లి కృష్ణ, భద్రాచలం నాయకులు బుడగం శ్రీనివాస్, మాజీ గ్రంథాలయ చైర్మన్ భోగల శ్రీనివాస్ రెడ్డి, ,నల్లపు దుర్గాప్రసాద్, ,పట్టణ అధ్యక్షులు నరేష్, సతీష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘాన్ని కలిసిన టిడిపి బృందం

**అమరావతి**

ఏపీలో జరగనున్న గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార వైసిపీ అవకతవకలకు పాల్పడుతోందని టీడీపీ నేతలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసారు.

అధికార పార్టీ ఓటర్లను ప్రలోభ పెట్టడంతో పాటు ఓట్లనే తారుమారు చేస్తుందని పిర్యాదు చేసారు. నేతలు మాజీ మంత్రులు నక్కా ఆనందబాబు, ఆలపాటి రాజా, ఎమ్మెల్సీ అశోక్ బాబు తదితరులు ఎన్నికల సంఘాన్ని కలిసినవారిలో వున్నారు.

మాజీమంత్రి నక్కా ఆనంద్ బాబు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అవకతవకలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాం. అధికార పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేసేందుకే ఎమ్మెల్సీ కల్పన రెడ్డి భర్త ప్రతాప్ రెడ్డిని విద్యాశాఖ కడప ఆర్జేడీ గా ప్రభుత్వం నియామించింది. కృష్ణాడగుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తన భార్య కల్పనరెడ్డిని ...ప్రతాప్ రెడ్డి ఉపాధ్యాయులను బెదిరించి,ప్రలోభపెట్టి గెలిపించుకున్నాడు

ఇదే విధానాన్ని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రతాప్ రెడ్డిని వాడుకుంటోంది.

ఫిర్యాదుపై ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందిస్తుందని నమ్మకం ఉందని అన్నారు.

ప్రతాప్ రెడ్డిని విద్యాశాఖ కడప ఆర్ జేడీగా విధుల నుండి తొలగించాలని ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాకు విన్నవించుకున్నాం. తిరుపతి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనర్హులను ఓటర్లుగా నమోదు చేశారు. ఇదే అంశాన్ని గతంలో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామని వెల్లడించారు.

దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకున్నారని ఎన్నికల సంఘాన్ని అడిగాం. ఒకసారి సమీక్షించామని... మరో మారు సమీక్షించి చర్యలు తీసుకుంటామని ముఖేష్ కుమార్ మీనా తెలిపారని అన్నారు.

# ఉద్యమ నాయకులనే ఎన్నుకుందాం

**ఎమ్మిగనూరు**

ఎమ్మిగనూరు పట్టణంలో రాయలసీమ పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమ నేతలను ఎన్నుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పంపన్న గౌడ్. చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ సి గురు శేఖర్ ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజేంద్ర ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజు చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లేష్ అన్నారు× ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మరియు పట్టభద్రుల ఎమ్మెల్సీ పోతుల నాగరాజు గారి అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ ప్రచారం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉద్యమ నేతగా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా ఏపీ జెసి కో చైర్మన్గా ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి చైర్మన్గా పనిచేసిన రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఎస్ టి యు ఏపీ ఏకగ్రీవ తీర్మానం మేరకు సంఘ అధికార అభ్యర్థిగా పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజకవర్గం నుండి ఎమ్మెల్సీగా గెలుపొంది పెద్దల సభ అయినా ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో అడుగుపెట్టిన నాటినుండి రాష్ట్ర ఉపాధ్యాయ సంఘ పక్షాన శాసనమండలి సభ్యునిగా పనిచేసిన కత్తి నరసింహారెడ్డి గారి అభ్యర్థిత్వాన్ని ఫస్ట్ ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రార్థించడం జరిగింది. వారితోపాటు పశ్చిమ రాయలసీమ నియోజకవర్గ పట్టబద్దుర్ల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు గారు గత 32 సంవత్సరాలుగా అనేక ఉద్యమాల్లో భాగస్వామ్య దానికి కట్టుబడి ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిని వదులుకొని మన డాక్టర్ పోతుల నాగరాజు గారికి ప్రస్తుత శాసనమండలిలో ప్రజల గొంతుగా నిలిసిస్తూ



అనేక సమస్యల ను చట్టసభలో వినిపిస్తూ నిస్వార్థ ప్రజా సేవకులుగా అందరి ప్రశంసలు పొందిన ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ పిడిఎఫ్ ఎస్ టి యు యుటిఎఫ్ జన విజ్ఞాన వేదిక మరియు ఉద్యోగ ఉపాధ్యాయ విద్యార్థి నిరుద్యోగ బహుజన మేధావుల కుల సంఘాల ప్రజాసంఘాల సామాజిక ఉద్యమ నేతల సంఘ సేవకుల రాయలసీమ అభివృద్ధి ఉద్యమాల నేతలు మహిళా సంఘాలు రచయిత జర్నలిస్టు ప్రతినిధుల కళాకారుల కార్మిక సంఘాల న్యాయవాదుల డాక్టర్లు ఇంజనీర్లు మద్దతుతో మన ముందుకు వస్తున్న పోతుల నాగరాజు బీసీ గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్ మహా శ్రేణులను కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు నాగేష్. కెవిపిఎస్ జిల్లా నాయకులు నాగప్ప ఏఐటీయూసీ నాయకులు మునిస్వామి, విజయ్ కుమార్, సిఐటియు చేతి వృత్తుదారుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

# వృద్ధులకు చట్టరీత్యా రక్షణ

**సర్పవరం**

ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై చిన్న చిన్న కుటుంబాలుగా మారడంతో వృద్ధులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని, వీరి రక్షణకు పలు చట్టాలు అమలులో ఉన్నందున వాటిపై అవగాహన పెంచుకోవాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా సంఘ అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణ రాజు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్ లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. హిందూ దత్తత మరియు పోషణ చట్టం 1956 ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదేనని అన్నారు. వారు నిర్లక్ష్యం చేస్తే రెవిన్యూ డివిజన్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. పిల్లల మాయ మాటలు విని ముందుగానే ఆస్తిని వారికి వ్రాసిన యెడల వారు మోసం చేస్తే తిరిగి ఆ ఆస్తిని తల్లిదండ్రులు తిరిగి స్వాధీనం చేసుకునే అవకాశం ఉందన్నారు. ఏదేమైనా పిల్లలకు ముందుగానే ఆస్తిపాస్తులు ఇవ్వరాదని, దాన పట్టా ద్వారా తమ తదనంతరం అందే విధంగా




వ్రాయడం మంచిదని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వృద్ధుల కోసం ప్రత్యేక వార్డులు ఏర్పరచాలని ఇటీవల జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆసుపత్రి వర్గాలను కోరినట్లు తెలిపారు. వృద్ధులకు ఏదైనా సమస్య వస్తే పోలీస్ స్టేషన్లో తక్షణం స్పందించే విధంగా పోలీసు ఉన్నతాధికారులను ఆ సమావేశంలో కోరినట్లు తెలిపారు. వృద్ధులకు ఏ సమస్య వచ్చినా జాతీయ వృద్ధుల హెల్ప్ లైన్ 14567 కు ఫిర్యాదు చేయాలని బుద్ధరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# 'సిద్ధార్థ్ రాయ్' కాన్సెప్ట్ పోస్టర్, ఫస్ట్ లుక్‌ను లాంచ్ చేసిన హరీష్ శంకర్, అల్లు అరవింద్



బాలకృష్ణ, ప్రభాస్, అల్లు అర్జున్, మహేష్ బాబు, రవితేజ వంటి స్టార్ హీరోలతో పాటు త్రివిక్రమ్ శ్రీనివాస్, సుకుమార్, బోయపాటి శ్రీను వంటి స్టార్ డైరెక్టర్లతో అతడు, ఆర్య, పౌర్ణమి, భద్ర, లెజెండ్ వంటి చిత్రాలకు పనిచేసిన పాపులర్ చైల్డ్ ఆర్టిస్ట్ యంగ్ చాప్ దీపక్ సరోజ్.. శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్, విహాన్ & విహిన్ క్రియేషన్స్ పతాకాలపై ప్రొడక్షన్ నెం 1గా జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయినలు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రంతో హీరోగా అరంగేట్రం చేస్తున్నారు. హరీష్ శంకర్, వంశీ పైడిపల్లి వంటి పెద్ద దర్శకుల దగ్గర పనిచేసిన వి యేశస్వి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు.

ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్‌ను ఈ రోజు విడుదల చేశారు. ఈ చిత్రానికి 'సిద్ధార్థ్ రాయ్' అనే టైటిల్ పెట్టారు. కాన్సెప్ట్ పోస్టర్‌ను హరీష్ శంకర్ ఆవిష్కరించగా, అల్లు అరవింద్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఎన్ ఎక్ సెంట్రిక్ లైఫ్ స్టోరీ' అనేది సినిమా ట్యాగ్‌లైన్. రెండు పోస్టర్లు యువతను ఆకట్టుకుంటున్నాయి. ఒక పోస్టర్‌లో దీపక్ సరోజ్ నోట్లో రెండు సిగరెట్లతో, చేతిలో ఎర్ర గులాబీని పట్టుకుని కనిపిస్తున్నాడు. పొడవాటి జుట్టు గడ్డంతో, దీపక్ తన దుస్తుల మొత్తం రక్తంతో కనిపిస్తున్నాడు. మరో పోస్టర్‌లో లవర్ పాత్ర పోషించిన తన్వి నేగి తో లిప్ లాక్ చేస్తూ కనిపించాడు. సిద్ధార్థ్ రాయ్ న్యూ జనరేషన్ లవ్ స్టోరీ అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

కొత్తవారితో ఈ చిత్రం రూపొందుతున్నప్పటికీ, ఇందులో కొంత మంది ప్రముఖ సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు . సామ్ కె నాయుడు కెమరా మెన్ గా, రాధన్ సంగీత దర్శకుడిగా ప్రవీణ్ పూడి ఎడిటర్ గా పని చేస్తున్నారు. ఈ చిత్రం ఇప్పటికే హైదరాబాద్, వైజాగ్‌లోని రిచ్ అండ్ బ్యూటిఫుల్ లొకేషన్స్‌లో షూటింగ్ పూర్తి చేసుకుంది.




## 3ఆ టెక్నాలజీతో రూపొందుతోన్న విజువల్ వండర్
## 'శాకుంతలం' నుంచి 'మధుర గతమా..' లిరికల్ సాంగ్ రిలీజ్



"మధుర గతమా
కాలాన్నే ఆపకా
ఆగావే సాగకా
అంగుళికమా
జాలైనా చూపకా
చేజారావే వంచికా.."

అని దుష్యంతుడికి దూరమైన శకుంతల మనసులోని బాధను పాట రూపంలో వ్యక్తం చేస్తుంది. దుర్వాసుడి శాపం కారణంగా దుష్యంతుడి వారి ప్రేమకు, గాంధర్వ వివాహానికి గుర్తుగా ఇచ్చిన ఉంగరాన్ని పోగొట్టుకుంది శకుంతల. శాపం కారణంగా దుష్యంతుడు కూడా తన భార్యను మరచిపోతాడు. అలాంటి పరిస్థితుల్లో అసహాయురాలైన ఆమె ఏం చేస్తుంది? శకుంతల మనసుకి తగిలిన గాయాన్ని కాలం ఎలా మాన్పించింది అనే విషయాలు తెలుసుకోవాలంటే 'శాకుంతలం' సినిమా చూడాల్సిందే అని అంటున్నారు ఎపిక్ ఫిల్మ్ మేకర్ గుణ శేఖర్.

ఆయన దర్శకత్వంలో 3ఆ టెక్నాలజీతో విజువల్ వండర్‌గా రూపొందుతోన్న పౌరాణిక ప్రేమ కథా చిత్రం 'శాకుంతలం'. దుష్యంత మహారాజుగా దేవ్ మోహన్ నటించగా.. శకుంతల పాత్రలో స్టార్ హీరోయిన్ సమంత ఒదిగిపోయింది. ఈ పాన్ ఇండియా చిత్రాన్ని వరల్డ్ వైడ్‌గా తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఏప్రిల్ 14న భారీ ఎత్తున రిలీజ్ చేస్తున్నారు. శ్రీ వెంకటేశ్వరక క్రియేషన్స్ దిల్ రాజు సమర్పణలో గుణ టీమ్ వర్క్స్ బ్యానర్‌పై నీలిమ గుణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

కాలం పరిగెడుతున్నా ఇప్పటికీ ఎప్పటికీ నిత్య నూతనంగా ఉండేలా అభిజ్ఞాన శాకుంతలంలో దుష్యంతుడు, శకుంతల ప్రేమను కవి కాళిదాసు అద్భుతంగా వర్ణిస్తే దాన్ని మంచిపోయేలా అబ్బుర పరిచే సాంకేతిక విలువలతో.. ప్రతి ఫ్రేమ్‌ను కళ్లప్పగించి చూసేంత గొప్పగా తెరకెక్కించారు డైరెక్టర్ గుణ శేఖర్. ఆ విషయం ఇటీవల విడుదలైన పాటలు, టీజర్‌తో క్లియర్‌గా తెలిసింది. మంగళవారం ఈ విజువల్ వండర్ నుంచి 'మధుర గతమా..' అనే పాటను చిత్ర యూనిట్ విడుదల చేసింది.

పాట వింటుంటే ఓ ఎమోషనల్ టచ్‌తో సాగుతూ భార్యాభర్తల మధ్య ఉండే అనుబంధాన్ని పాట తెలియజేసేలా ఉంది. మెలోడి బ్రహ్మ మణిశర్మ సంగీత సారథ్యం వహించిన ఈ సినిమాలోని పాటను శ్రీమణి రాయగా.. అర్మాన్ మాలిక్, శ్రేయా ఘోషల్ పాడారు.

శాకుంతలం చిత్రానికి సాయి మాధవ్ బుర్రా సంభాషణలు అందించారు. శేఖర్ వి.జోసెఫ్ సినిమాటోగ్రఫీ చేసిన ఈ చిత్రానికి ప్రవీణ్ పూడి ఎడిటర్‌గా వర్క్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని విజువల్‌గానే కాకుండా మ్యూజికల్‌గానూ ఆడియెన్స్‌కు ఆమేజింగ్ ఎక్స్‌పీరియెన్స్ ఇవ్వటానికి రీ రికార్డింగ్‌ను బుడాపెస్ట్, హంగేరిలోని సింఫనీ టెక్నీషియన్స్ వర్క్ చేయటం విశేషం.

సమంత, దేవ్ మోహన్ జంటగా నటించిన శాకుంతలం చిత్రంలో డా.ఎం.మోహన్ బాబు, ప్రకాష్ రాజ్, మధుబాల, గౌతమి, అదితి బాలన్, అనన్య నాగళ్ల, జిస్సు సేన్ గుప్తా కీలక పాత్రలను పోషించారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కుమార్తె అల్లు అర్హ యువరాజు భరతుడి పాత్రలో నటించటం ప్రధాన ఆకర్షణ కానుంది




Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950